తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

విద్యా వ్యవస్థను సీఎం రేవంత్ నాశనం చేస్తున్నాడు: ఎంపీ అర్వింద్

న్యూఢిల్లీ: ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు. విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 257 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | బుధవారం, ఆగస్టు 05, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు తప్పనిసరిగా టీ ఫైబర్ కనెక్టివిటీ

అభివృద్ధి పథకాల అమలుపై త్వరలో ముఖ్యమంత్రితో సమీక్ష: సీఎస్

హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పలు అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) సంజయ్ జాజు తెలిపారు. సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం సీఎస్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమాల పురోగతి, లక్ష్యాలు, అమలు తదితర వివరాలను సవివరంగా తెలిపే డాష్ బోర్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు, శాఖల పనితీరు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కేంద్ర ప్రాయోజిత పథకాలపై మరో వారం రోజుల్లో ముఖ్యమంత్రి.. ప్రభుత్వ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలతో సహా అన్నింటికీ టీ ఫైబర్ కనెక్టివిటీని తీసుకోవాలని చెప్పారు. నవంబరు 14 నుంచి రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఖేలో-ఇండియా క్రీడోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీలు ఏర్పాటుచేయాలన్నారు.



క్యూర్ పరిధిలో వాహన కాలుష్యాన్ని తగ్గించాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డీజిల్‌తో నడిచే ఆటోలకు ఎలక్ట్రిక్ ఇంజిన్లు అమర్చే పథకాన్ని వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించాలి

రాష్ట్రంలో మీ-సేవ కేంద్రాలను మరింత పటిష్ఠపరిచి.. ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలో మీ-సేవ కేంద్రాల ఆధునికీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు, యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై డిజిటల్-ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేశ్ ఉత్తమ్ చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో సీఎస్ విస్తృతంగా చర్చించారు. దేశంలో డిజిటల్ రంగంలో పెట్టుబడులకు హరియాణా, తెలంగాణ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు.. రూ.2,000 కోట్ల పెట్టుబడుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. అనంతరం టి-ఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని మరో సమావేశంలో సీఎస్ ఆదేశించారు.

లోక్‌సభలో కొనసాగిన విపక్షాల ఆందోళన..

రెండు బిల్లులకు ఆమోదం



న్యూఢిల్లీ ,నీట్ పేపర్ లీకేజీ అంశం, రామాలయ విరాళాల చోరీ ఘటనలు లోక్‌సభను ఇవాళ కూడా స్తంభింపజేశాయి. సభ సజావుగా సాగనివ్వాలని స్పీకర్ ఓం బిర్లా విపక్ష సభ్యులను కోరగా.. వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. అయితే.. ఈ ఆందోళనల నడుమే కేంద్రం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. ట్యాక్సేషన్ ఇతర చట్టాల సవరణ బిల్లు, అప్రాప్రియేషన్ బిల్లు-2026ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. దీంతో వెంటనే సభలో చర్చకు రాగా.. విపక్ష సభ్యులు ఇరు బిల్లులనూ వ్యతిరేకిస్తూ గందరగోళం సృష్టించారు. కానీ.. చివరకు మూజువాణి ఓటుతో రెండు బిల్లులూ ఆమోదం పొందాయి. ఆ తర్వాత సభను రేపటికి వాయిదా వేశారు స్పీకర్.కాగా.. నేటితో పార్లమెంట్ సమావేశాలు 12వ రోజుకు చేరుకోగా.. సభ ప్రారంభంలోనే విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో సభాపతి సభను తొలుత మధ్యాహ్నం 12:00 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత మరోసారి 2:00 గంటలకు వాయిదా పడింది. అయితే.. ఈ సారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ప్రశ్నోత్తరాల సమయం జరగకపోవడం గమనార్హం.

బిఆర్ఎస్..సింగరేణికి రూ. 54 వేల కోట్లు బకాయిలు పెట్టింది: కిషన్ రెడ్డి

ఢిల్లీ: మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం వల్ల సింగరేణి సంస్థకు ఎంతో నష్టం జరిగిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. సింగరేణికి ఎవరి హయాంలో చెడు జరిగిందో చర్చకు బిఆర్ఎస్ సిద్ధమా? అని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి రూ. 54 వేల కోట్లు బకాయిలు పెట్టి పోయిందని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.54 వేల కోట్లు వసూలు చేస్తామని తెలియజేశారు. కొందరు ప్రధాని నరేంద్ర మోడీని



విమర్శిస్తూ..సోషల్ మీడియాలో వీడియోలు పెట్టారని, అభ్యంతరకర వీడియోలపై ఇప్పటికే కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారని కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసేలా..రెచ్చగొట్టే వీడియోలు పెట్టారని, మెటా ఇండియా ప్రతినిధిపై కూడా పోలీసులు కేసు పెట్టారని మండిపడ్డారు. హైదరాబాద్ లో బిజెపి కార్యకర్త సాయికిరణ్ గౌడ్ ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసిన పోలీసులను ప్రభుత్వం బెదిరిస్తోందని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు.

6 నెలల్లో ప్రాజెక్టులకు అనుమతులు సాధించాలి

- పాలమూరు, సీతారామ, డిండి, గౌరవెల్లిలకు ప్రాధాన్యం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- పోలవరం పూర్తికాక ముందే ఉమ్మడి ఖమ్మంలో ముంపును గుర్తించాలి: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులను వీలైనంత త్వరగా సాధించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. ఆరు నెలల్లో అనుమతులు సాధ్యమయ్యేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాలను తెరిచిందని చెప్పారు. సోమవారం సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులతో కలసి ఉత్తమ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గతంలో కేంద్ర సంస్థల నుంచి తిరస్కరణకు గురైన ఈ నాలుగు ప్రాజెక్టుల ప్రతిపాదనలను సరిదిద్ది తిరిగి సమర్పించాలి. సుప్రీం తాజా తీర్పు వెనుక రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సాగించిన న్యాయపోరాటం ఉంది. పర్యావరణ అనుమతులు సాధించేలా ప్రతి ప్రాజెక్టుకు ఒక నోడల్ అధికారిని నియమించాలి. గౌరవెల్లి పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణకు సిద్ధంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి. సీతారామ సాగర్‌కు అవసరమైన పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలి. ఆమోదం లభించగానే పనులు ప్రారంభించేలా అన్నీ సిద్ధం చేసుకోవాలి. పాలమూరు-రంగారెడ్డి,



డిండిలకు పర్యావరణ అనుమతులు వచ్చేలా చూడాలి. పోలవరం వెనుక జలాల ప్రభావాన్ని సమర్థంగా అంచనా వేయాలి' అని పేర్కొన్నారు.

వీలైనంత త్వరగా సీతమ్మ సాగర్: పొంగులేటి

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 'పోలవరం ప్రాజెక్టు పూర్తయి వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై వెనుక జలాల ప్రభావం ఎంతవరకు ఉంటుందో స్పష్టంగా అంచనా వేయాలి. ఆ వివరాలను కేంద్ర సంస్థల ఎదుట ఉంచాలి. బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదే. మరోవైపు సీతమ్మసాగర్ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. అది పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుంది' అని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ పోలవరం ముంపుపై శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని సూచించారు. ఈఎన్సీలు రమేశ్‌బాబు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది: కేటీఆర్

హైదరాబాద్: 'ఆజాద్ ఇంజనీరింగ్, 'ణ=ణూ' సంయుక్తంగా సాధించిన చరిత్రాత్మక విజయంపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. 350 కేజీల మొట్టమొదటి స్వదేశీ థ్రస్ట్-క్లాస్ ఎక్స్‌పెండబుల్ టర్బోజెట్ ఇంజిన్‌ను విజయవంతంగా తయారు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌తో పాటు భారత్‌కి ఇది ఒక గర్వించదగిన మైలురాయి అని కేటీఆర్ పేర్కొన్నారు. భారతదేశపు స్వదేశీ ప్రొపల్షన్ సామర్థ్యాన్ని, రక్షణ రంగంలో స్వావలంబనను ఇది గణనీయంగా బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ఎయిరోస్పేస్, ప్రిసిషన్ ఇంజనీరింగ్ రంగాలు సాధించిన పురోగతికి ఈ జెట్ ఇంజిన్ ఉత్పత్తి నిదర్శనమని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు ఇది ఊతం అవుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయి ఎరోస్పేస్ హబ్‌గా మారిన హైదరాబాద్ ఖ్యాతి మరింత పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.



విద్య, వైద్య రంగానికి పెద్ద పీట..

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.



జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో రాష్ట్ర మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలసి నూతన సదరం శిబిరం, యుడిఐడి భవనాన్ని, ఆక్సిజన్ ప్లాంట్, అర్థో, గైనిక్, జనరల్ సర్జరీ, ఈ ఎన్ టి విభాగాలకు సంబంధించిన నాలుగు ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య శాఖ మంత్రి దామోదర నరసింహ పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందని, రానున్న రోజులలో జిల్లా కేంద్రంలో ప్రత్యేక డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా ఆసుపత్రి ఇరుకుగా ఉన్న కారణంగా మరో ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో కన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందడం ఆశించదగ్గ విషయమని, ప్రైవేట్ హాస్పిటల్స్ కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరమర్శించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి

చంద్ర శేఖర్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ఇంటర్నెట్: మంత్రి శ్రీధర్ బాబు..



హైదరాబాద్: తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్దిష్ట గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు.ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ (ఏ-నాచింబె) నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు.అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

బుధవారం, ఆగస్టు 05, 2026

మారుతున్న రాజకీయాలు

ఒకప్పుడు రాజకీయాల్లో ప్రజల మనసు గెలవాలంటే పాదయాత్రే ప్రధాన ఆయుధంగా ఉండేది. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకోవడం ద్వారా నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకునేవారు. కానీ కాలం మారుతోంది? రాజకీయ కమ్యూనికేషన్ కూడా మారుతోంది. ఇప్పుడు జాబ్ మేళాలు, మెడికల్ క్యాంపులు, మహిళా సమావేశాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ కావడం వంటి కొత్త పద్ధతులు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. మరి నిజంగానే పాదయాత్రల యుగానికి ప్రత్యామ్నాయం వచ్చిందా?తెలుగు రాష్ట్రాల్లో గత రెండు దశాబ్దాలుగా పాదయాత్రలు రాజకీయ విజయానికి కీలక వ్యూహంగా నిలిచాయి. 2003లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి చేపట్టిన పాదయాత్ర, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన "వస్తున్నా మీ కోసం", వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన "ప్రజా సంకల్ప యాత్ర" వంటి కార్యక్రమాలు రాజకీయంగా పెద్ద మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి ఇవి సమర్థమైన వేదికలుగా మారాయి.అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియా విస్తరణతో నాయకుడు ఒక గ్రామంలో చేసిన కార్యక్రమం క్షణాల్లోనే లక్షల మందికి చేరుతోంది. దీంతో ప్రజలను కలవడానికి పాదయాత్ర ఒక్కటే మార్గం కాదనే భావన బలపడుతోంది. ఇక ప్రజల అంచనాల్లో కూడా మార్పు కనిపిస్తోంది. "ఎంత నడిచారు?" అనే ప్రశ్న కంటే "ఏం చేశారు?" అనే ప్రశ్నకు ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ముఖ్యంగా యువత ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై నాయకుల చర్యలను గమనిస్తోంది. అందుకే రాజకీయ నాయకులు కూడా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నిరంతర ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇటీవలి కాలంలో మెగా జాబ్ మేళాలు, ఉచిత వైద్య శిబిరాలు, మహిళా సంఘాలతో సమావేశాలు, రైతు అవగాహన సదస్సులు, స్కిల్ ట్రైనింగ్ క్యాంపులు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇవి ఏ ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కాకుండా వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అమలు చేస్తున్న కార్యక్రమాలుగా మారుతున్నాయి.అదే సమయంలో ప్రచార విధానంలో కూడా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు పోస్టర్లు, భారీ బహిరంగ సభలు ప్రధాన ప్రచార సాధనాలైతే, ఇప్పుడు రీల్స్, షార్ట్ వీడియోలు, లైవ్ స్ట్రీమింగ్, డిజిటల్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్థానిక స్థాయిలో చిన్న సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. అయితే రాజకీయ విజయాన్ని ఒక్క అంశంతోనే ముడిపెట్టలేమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పార్టీ బలం, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ఎన్నికల సమయంలో నెలకొనే రాజకీయ వాతావరణం వంటి అనేక అంశాలు కలిసి ఫలితాలను ప్రభావితం చేస్తాయి.భారతదేశంలో డిజిటల్, సోషల్ మీడియా విస్తరణ నేపథ్యంలో, ప్రజా చర్చ మరియు ప్రజాభిప్రాయ స్వయంప్రతిపత్తి సవాలుకు గురయ్యాయి. భారతదేశపు 2019 సార్వత్రిక ఎన్నికలు, నిజమైన డిజిటల్ వినియోగ సమాజంలో జరిగిన మొట్టమొదటి జాతీయ ఎన్నికలు. ఈ ఎన్నికలలో, ఓటర్లలో సుమారు నగం మందికి డిజిటల్ మార్గాలు అందుబాటులో ఉండగా, మరో మూడో వంతు మందికి సోషల్ మీడియా అందుబాటులో ఉంది. ప్రవంచ పోకడకు అనుగుణంగా, భారతీయ రాజకీయ నాయకులు తమ మద్దతుదారులతో నేరుగా మమేకమవ్వడానికి, రోజువారీ రాజకీయ సంభాషణల కోసం సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. జిటల్ వేదికలపై కార్యకలాపాలను, అలాగే అవి విస్తృత రాజకీయ సమీకరణ నుండి ఏ విధంగా విడదీయరానివిగా ఉన్నాయో విశ్లేషిస్తుంది.ఔజూలోని దక్షిణాసియా అధ్యయనాల సంస్థ మరియు కొన్రాడ్ అడెనార్ స్టిఫ్టుంగ్ నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో ఈ పత్రాల ముసాయిదా ప్రతులు సమర్పించబడ్డాయి."ప్రధాన మీడియా స్రవంతిని బీజేపీ తన నియంత్రణలోకి తీసుకుంది" అని కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం హెడ్ సుప్రియా శ్రీనేత్ అన్నారు.మా నిధులను స్తంభింపచేశారు. ప్రకటనలపై ఖర్చు పెట్టేందుకు మా దగ్గర డబ్బులు లేవు" అని ఆమె అన్నారు. ఎన్నికలకు ముందుగా ఆదాయపు పన్ను విభాగం తీసుకున్న చర్యల గురించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం రాజకీయ ప్రతీకారం తీర్చుకుంటోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే, దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయని, దీనిలో తమ పాత్రేమీలేదని ప్రభుత్వం అంటోంది."ఇలాంటి ఇబ్బందుల నడుమ ఓటర్లను చేరుకునేందుకు ఇన్‌ఫ్లుయెన్సర్లు వారధిలా పనిచేస్తున్నారు. మా పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసం ఉండేవారితోపాటు మా వర్క్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయాలనుకునేవారితో మేం కలిసి పనిచేస్తున్నాం" అని ఆమె చెప్పారు.సోషల్ మీడియాను ప్రజాస్వామ్యీకరించడంలో ఇన్‌ఫ్లుయెన్సర్లు సాయం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మాజీ పొలిటికల్ అడ్వైజర్ అంకిత్ లాల్ అన్నారు.ద దేశ్‌భక్త్ యూట్యూబ్ చానెల్ నడిపే మాజీ జర్నలిస్టు ఆకాశ్ బెనర్జీ మాట్లాడుతూ ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ హద్దులను చెరిపేసుకుంటూ ఒక్కో అడుగు ముందుకు వెళ్తున్నారని చెప్పారు.జర్మనీ నుంచి యూట్యూబ్ చానెల్ నడిపిస్తున్న ధ్రువ్ రాఠీ తాజాగా చేసిన 'ఈజ్ ఇండియా బికమింగ్ ల డిక్టేటర్‌షిప్?' వీడియోను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఆ వీడియోకు ఇప్పటివరకూ 24 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. దీనిపై ప్రభుత్వం స్పందించలేదు.'ఆ వీడియో తర్వాత డిక్టేటర్‌షిప్ అనే పదంపై చాలా చర్చ కొనసాగింది. ఇలా జరగడం నేను ముందెన్నడూ చూడలేదు" అని బెనర్జీ అన్నారు.

- ఎడిటర్

వరిసాగుకే మొగ్గు

నిజామాబాద్, ఆగస్టు 4 (న్యూస్ పల్స్) ఎల్ నినో ప్రభావం ఆగస్టు సెప్టెంబర్ నెలల్లో తీవ్రమవుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నప్పటికీ రైతులు మాత్రం వెనక్కి తగ్గకుండా వరి సాగు వైపే భారీగా మొగ్గు చూపుతున్నారు. గత వారం జూలై 22 నాటికి రాష్ట్రవ్యాప్తంగా పదకొండు లక్షల రెండు వేల ఎకరాల్లో మాత్రమే ఉన్న వరి సాగు కేవలం ఒక్క వారంలోనే అనూహ్యంగా ఇరవై లక్షల నలభై ఆరు వేల ఎకరాలకు వివరీతంగా పెరిగిపోయింది. ప్రత్యామ్నాయ పంటలను వేయాలని ప్రభుత్వ అధికారులు పదే పదే సూచించినప్పటికీ కందులు పెసలు మినుములు సోయాబీన్ తో పాటు వరినే రైతులు ప్రధానంగా ఎంచుకున్నారు. జూన్ రెండో వారం నుంచి వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో ఆందోళన చెందిన అన్నదాతలు బోరు బావుల కింద నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. గత ఇరవై మూడో తేదీ వరకు నరైన వర్షాలు లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించినా ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతన్నల్లో మళ్లీ ఆశలు పూర్తిగా చిగురించాయి.నాలుగైదు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పాటు గోదావరి కృష్ణా నదుల్లోకి నీటి ఇన్‌ఫ్లో భారీగా పెరుగుతుండటంతో ఎల్ నినో భయాలన్నీ ఒక్కసారిగా తొలగిపోయాయి. దీనితో మెదక్ ఆసిఫాబాద్ నిజామాబాద్ కామారెడ్డి సంగారెడ్డి కొత్తగూడెం తదితర జిల్లాల్లో డెబ్భై ఐదు శాతానికి పైగా భూములు సాగులోకి వచ్చాయి. నిజామాబాద్ జిల్లాలో మూడు లక్షల ముప్పై వేలకు పైగా కామారెడ్డిలో రెండు



లక్షల రెండు వేలకు పైగా కరీంనగర్ లో లక్షా నలభై తొమ్మిది వేలకు పైగా ఎకరాల్లో వరి పంట సాగైంది. ఆదిలాబాద్ జిల్లాలో అంచనా వేసిన దానికంటే ఎక్కువగా నూటఒక శాతం మేర సాగు విస్తీర్ణం నమోదైంది. అయితే నల్లగొండ సూర్యాపేట భువనగిరి వనపర్తి నాగర్‌కర్నూల్ ములుగు జగిత్యాల తదితర జిల్లాల్లో మాత్రం నలభై శాతం కూడా మొత్తం పంటల విస్తీర్ణం దాటలేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ రంగారెడ్డి ఖమ్మం జిల్లాల్లో సంతృప్తికరమైన వర్షాలు పడకపోవడంతో వరి నాట్లు ఇంకా పూర్తిగా పూర్తికాలేదు.వరి సాగులో ఎప్పుడూ ముందుండే నల్లగొండ జిల్లాలో ఈసారి పరిస్థితి చాలా దారుణంగా మారిపోయింది. జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల నలభై ఒక్క వేల ఎకరాల్లో వరి పంట సాగు కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం ఎనభై వేల ఎకరాలలోపే పరిమితమైంది. అంటే కేవలం పదిహేను శాతం మాత్రమే వరి సాగు జరిగినట్లు స్పష్టమవుతోంది. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో రైతులు విత్తనపు వడ్లు తెచ్చి ఇంట్లోనే పెట్టుకున్నప్పటికీ ప్రాజెక్టుల్లో నీటిమట్టం పడిపోవడంతో నారు పోయడానికి తీవ్రంగా వెనకాడారు. పత్తి సాగు కూడా ఐదు లక్షల యాభై ఐదు వేల ఎకరాలకే పరిమితమైంది. ఇక్కడి ప్రాజెక్టుల్లో నీరు అడుగంటిపోవడం వలన జిల్లా వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలోకి కూరుకుపోయింది. రాబోయే రోజుల్లో కనుక భారీ వర్షాలు కురవకపోతే నల్లగొండలో పంటలు కోలుకోవడం చాలా కష్టమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.ప్రభుత్వం గత కొన్ని వారాలుగా ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గుతాయని రిజర్వాయర్లలో నీరు ఉండదని పదే పదే హెచ్చరించింది. తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించడం వల్ల ఆ దిశగా కొంత మేర విస్తీర్ణం పెరిగింది. అయితే వర్షాలు పడటంతో ఆశపడిన రైతులు ప్రత్యామ్నాయాలతో పాటు తమకు అలవాటైన వరి సాగు వైపే పరుగులు తీశారు. కొన్ని జిల్లాల్లో పంటల సమయం ముగిసిపోతుందనే ఆందోళన మరోవైపు వర్షాలు నరిగా లేవనే దిగులు రైతులను అయోమయంలో పడేశాయి. ఇప్పుడు పడుతున్న వర్షాలు పంట చేతికి వచ్చే వరకు ఉంటాయో లేదోనని రైతన్నలు తీవ్రంగా మథనపడుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో గత ఏడాది మూడు లక్షల డెబ్భై రెండు వేల ఎకరాల్లో సాగు జరిగితే ప్రస్తుతం మూడు లక్షల ముప్పై వేల ఎకరాలకు పడిపోయింది. కామారెడ్డిలో మాత్రం గత ఏడాది లక్షా అరవై నాలుగు వేల ఎకరాల నుంచి ఈసారి రెండు లక్షల రెండు వేలకు పెరిగింది.

ఓఆర్ఆర్ చుట్టూ రియల్...

హైదరాబాద్, ఆగస్టు 4 (న్యూస్ పల్స్)హైదరాబాద్ మహానగరం నలువైపులా శరవేగంగా విస్తరిస్తుండటంతో స్థిరాస్థి రంగం సరికొత్త పుంతలు తొక్కుతోంది. ఔటర్ రింగ్ రోడ్ ను దాటి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్ దిశగా నగరం అడుగులు వేస్తుండటంతో, ఓఆర్ఆర్ , ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న శాటిలైట్ ప్రాంతాలు ప్రాపర్టీ పెట్టుబడులకు హాట్‌స్పాట్‌లుగా మారుతున్నాయి. ముఖ్యంగా షాద్‌న గర్, భువనగిరి, సంగారెడ్డితో పాటు తూర్పు హైదరాబా ద్‌లోని ఘట్‌కేసర్, ఉప్పల్-వరంగల్ నేషనల్ హైవే కారిడార్ల పరిసరాల్లో నూతన రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఊఓఅం, ఆఅఖ ఆమోదం పొందిన ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ ఒక్కసారిగా పుంజు కుంది.భవిష్యత్తు రవాణా అవసరాలను తీర్చేందుకు ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మాణం కానుండటం, పారిశ్రామిక ప్రాజెక్టుల విస్తరణ, డిజిటల్, డేటా సెంటర్ల రాక వంటి కీలక అంశాలు ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన చోదక శక్తులుగా నిలుస్తున్నాయి. వ్యాపారవేత్తలు, మధ్యతరగతి ఉ ద్యోగులు తక్కువ ధరలోనే లభించే ఓపెన్ ప్లాట్లలో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఓఆర్ఆర్ దాటి కొన్ని నిమిషాల ప్రయాణ వ్యవధిలోనే ప్రధాన నగరానికి చేరుకునేలా మెరుగైన ఫోర్-లేన్, సిక్స్-లేన్ రహదారుల అనునంధానం ఏర్పడటం వీరికి అదనపు ప్రయోజనంగా మారింది.దక్షిణాన షాద్‌నగర్-జడ్చర్ల బెల్ట్ బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో పాటు సమీపంలోని ఇండస్ట్రి యల్ పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌ల కారణంగా ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పశ్చిమాన సంగారెడ్డి-ముంబై జాతీయ రహదారి పరిసరాలు కండి, ఐఐటీ హైదరాబాద్, పారిశ్రామిక జోన్లతో అనుసంధానమై ఉండటంతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అలాగే తూర్పున భువనగిరి-ఘట్‌కేసర్ కారిడార్ ఎమ్స్ , మెట్రో విస్తరణ వార్తలతో మధ్యతరగతి గృహ కొనుగోలుదారులకు ప్రధాన కేంద్రంగా మారింది.మహానగరం అంచుల్లో కేవలం ప్లాట్లు మాత్రమే కాకుండా, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాలు కూడా వేగవంతమవుతున్నాయి. రాబోయే 5 నుండి 10 ఏళ్ల కాలంలో ఆర్ఆర్ఆర్ సరిహద్దుల ప్రాంతాలు హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో కీలకమైన ఆర్థిక, నివాస హబ్‌లుగా రూపాంతరం చెందుతాయని, ముందస్తుగా ఇక్కడ చేసే పెట్టుబడులు ఆస్తిపరులకు మంచి రాబడులను అందిస్తాయని అంచనా వేస్తున్నారు.

ఆలయ స్థల వివాదంపై రాజకీయాల్లోదు

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బీరప్ప దేవాలయ స్థల వివాదంపై ఎమ్మెల్యే వాస్తవాలు విచారించి ఆలయ స్థలం ఏర్పాటు కోసం కృషి

సమయం ఇవ్వండి అన్ని తెలుసుకుని న్యాయం చేస్తా

ఆలయాలు మన ఆత్మ గౌరవాలు..

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలుసుకున్న కురువ నాయకులు

బీరప్ప స్థల వివాదంపై రాజకీయాలతో వాస్తవాలు అన్ని పరిశీలించి అందరికి ఆమోదయోగ్యంగా ఉండేవిధంగా ఆలయాన్ని నిర్మించుకునేందుకు స్థల ఏర్పాటు జరుగుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. ఫరూక్ నగర్ ప్రాంతానికి చెందిన పలువురు కురువ కులస్తులు, ఇతర గ్రామ ప్రజలు మంగళవారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలుసుకున్నారు. సీఎస్కే వెంచర్ లో పురాతన బీరప్ప దేవాలయం స్థల వివాదాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. సీఎస్కే యాజమాన్యం



భూమి తీసుకున్న సమయంలో దానికి బదులుగా దేవాలయానికి భూమి ఇచ్చేందుకు ఒప్పుకున్నారని ఆ తర్వాత బీరప్ప దేవాలయం ఉన్న స్థలాన్ని ప్లాట్లుగా మార్చి గతంలోని విక్రయించారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కేవలం ఒక గుంట పొలం మాత్రమే అక్కడ ఉందని మిగతా స్థలం లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు బీరప్ప, శ్రీశైలం శివ, నక్కలపల్లి మల్లేష్, మహేందర్, మాసి, శ్రీను, శివ, ఎల్లన్ తదితరులు వివరించారు. ప్రస్తుతం అక్కడ కొన్ని నిర్మాణాలను తొలగించడంతో వివాదం మొదలైందని ఎమ్మెల్యే దృష్టి తెచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారితో మాట్లాడుతూ.. ఆలయాలు ఆత్మగౌరవాలని వాటికి భంగం ఎవరు కలిగించవద్దని తెలిపారు అయితే దాని గురించి పూర్తిస్థాయిలో తనకు అవగాహన లేదని వాస్త విషయాలను పూర్తిగా పరిశీలించి అక్కడ స్థలం ఉంటే తప్పకుండా అది వచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఇలాంటి సమయాల్లో రాజకీయాలు చేయవద్దని రాజకీయాలు చేస్తే తాను రానని వాస్తవాలు ఇలా ఉంటే అలా న్యాయం చేద్దామని వారికి అభయం ఇచ్చారు. కొంత సమయం తీసుకుని దానిపై పూర్తిగా విచారించి ఆలయ స్థలం కోసం పూర్తిస్థాయిలో ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ తదితరులు ఉన్నారు

సింగరేణిని కాపాడండుకు కేంద్రం పార్లమెంట్ లో బిల్లు చెయాలి

ఆర్టీసీని ఎన్నికలు జరిగిన వెంటనే ఆర్టీసీని విలీనం చేయాలి-సిపిఐ

హైదరాబాద్,మణుగూరు ఓపెన్ కాస్ట్ -2 సింగరేణి కి దక్కడం మంచి పరిణామం. మణుగూరును కాపాడినందుకి సీఎం, డీసీఎం ధన్యవాదములని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి డీప్ బ్లాక్ ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి ఎన్నో కుట్రలు జరిగాయి. సింగరేణి ప్రైవేటికరణ అడ్డుకట్ట వేయడానికి సీఎంకు వినతి లెటర్ ఇచ్చి - సీఎంను కలిసి మాట్లాడారు. సింగరేణి నష్టాలను చూపించి ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేందుకు కుట్రలు ఇంకా జరుగుతున్నాయి. సింగరేణి అభివృద్ధి చేస్తా అని కేసీఆర్ వైఫల్యం అయ్యారు - ఇప్పుడు కేసీఆర్ లెక్క కాకుండా సింగరేణిని అభివృద్ధి చేయాలని అన్నారు.సింగరేణిని కాపాడండుకు కేంద్రం పార్లమెంట్ లో బిల్లు చెయాలి. సింగరేణి పై దూరదృష్టి లేకపోతే తెలంగాణలు నష్టం జరుగుతుంది. సింగరేణి పై బ్లూ ప్రింట్ తయారు చేయాలి కోరుతున్నా. సింగరేణికి ప్రభుత్వం 56వేల కోట్లు అప్పు ఉంది... ప్రభుత్వం ఆ నిదులను విడుదల చేయాలి. సింగరేణిని కాపాడెందుకు మేము ఉద్యమం చెస్తాం - ప్రభుత్వం ఈగోకు పోకుండా సమ్మె పై ప్రభుత్వం చర్చలు సఫలం చేయాలి.శ్రాణావపల్లి, సత్తుపల్లి, ఇల్లందు కోయిగూడెం, సత్తుపల్లి - కోయిగూడెం -2, గుండాల, పెనుబల్లి, గారిమెల్ల పాలెం మైన్ చేయాలి. ఆర్టీసీని ఎన్నికలు జరిగిన వెంటనే ఆర్టీసీని విలీనం చేయాలి.. లేదంటే పోరాటం చెస్తామని అన్నారు.కాళేశ్వరం బ్యారేజిలపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలి. పాలన చేసే వాళ్లంతా మేమే మేధావులం అనుకుంటారు.రాజకీయాల కోసం సంబంధం లేకుండా కామెంట్స్ చేస్తారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి, ఫ్యూచర్ సిటీ పై సీఎం పడ్డారు.

తెలంగాణలో ఇంజనీరింగ్ విద్యార్థుల కరువు

హైదరాబాద్, ఆగస్టు 4 (న్యూస్ పల్స్)తెలంగాణాలో ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థుల వేటలో పడ్డాయి. కన్వీనర్ కోటా, మేనేజ్మెంట్ కోటా సీట్లు భర్తీ కాకపోవడంతో ఏమి చేయాలో తోచక తలపట్టుకుంటున్నాయి. ఇప్పటికే రెండు విడతల కౌన్సిలింగ్ అయిపొయింది. శుక్రవారం నుంచి మూడో విడత చివరి కౌన్సిలింగ్ జరుగుతుంది. ఇంకా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకోని విద్యార్థులు వెంటనే స్లాట్ బుక్ చేసుకొని హెల్ప్ లైన్ కేంద్రాలకు వెళ్లాలని యాజమాన్యాలు బతిమాలుతున్నాయి. అయినా సరే పూర్తి సీట్లు భర్తీ అయ్యే పరిస్థితి కనిపించడం లేదని యాజమాన్యాలు దిగులుపెట్టుకున్నాయి. తెలంగాణాలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 22,972 సీట్లు మిగిలిపోయాయి. మేనేజ్మెంట్ కోటాకు కూడా భారీగా డిమాండ్ తగ్గినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలాల్లో కన్వీనర్ కోటాలో మొత్తం 94,424 సీట్లు ఉండగా రెండు విడతలుగా జరిగిన కౌన్సిలింగ్ లో 71,452 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన సీట్లు భర్తీ కావడానికి ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు కొత్త దారులు వెదుకుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ విషయంలో కన్సలెంట్లు కీలక పాత్ర పోషిస్తుంటారన్నది బహిరంగ రహస్యం. జూనియర్ కాలేజీ నిర్వాహకులు, అక్కడ పనిచేసే లెక్చరర్ల ద్వారా విద్యార్థులను ఆకర్షిస్తుంటారు. అయితే కొన్ని పేరున్న ఇంజనీరింగ్ కళాశాలలు గత కొన్నేళ్లుగా వారిని దగ్గరకు రానివ్వడం లేదు. ఇప్పుడు పరిస్థితి తలకిందులు కావడంతో పెద్ద కాలేజీలు సైతం కన్సల్టెంట్ల వద్దకు పరుగులు తీస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.నిన్నా మొన్నటి దాకా యాజమాన్యం ఇచ్చింది తీసుకొన్న కన్సల్టెంట్ల పంట పండింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటా, మేనేజ్మెంట్ కోటాలో ఐదు సీట్లు భర్తీ చేసిన వారికి రెండు సీట్లు ఉచితంగా ఆఫర్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఎల్బీ నగర్, హయాత్ నగర్ ప్రాంతాల్లోని కాలేజీలు ఒక అడుగు ముందుకేసి ఒకటికి ఒకటి ఉచితం అంటూ ఊరిస్తున్నట్లు సమాచారం. బాచుపల్లి, నిజాం పేట్, ఘట్ కేసర్ ప్రాంతాల్లోని కాలేజీలు సైతం మేనేజ్మెంట్ కోటా భర్తీ చేయడానికి కన్సల్టెంట్ల చుట్టూ తిరుగుతున్నట్లు చెబుతున్నారు.

ఇల్లంతకుంట మండలం లో బీజేపీకి పార్టీ కి ఈటలకు భారీ షాక్..

బీఆర్ఎస్‌లోకి ముగ్గురు సర్పంచ్‌లు

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గారి లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

హుజూరాబాద్, ఇల్లంతకుంట మండలంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఇల్లంతకుంట మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లో నందినగర్ నివాసం లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సిరిసేడు సర్పంచ్ కుమార్ -శ్యామల వంతడువుల సర్పంచ్ రాజేష్ -మాధవి టేకుర్తి సర్పంచ్ శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి, సంక్షేమం ప్రజల మనసుల్లో ఇప్పటికీ చెక్కుచెదరలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీజేపీ కూడా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా రాజకీయాలకే పరిమితమైందని అన్నారు.కాంగ్రెస్, బీజేపీ పాలనలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, గ్రామస్థాయిలో ఆ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మంది నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.కేసీఆర్ గారు మళ్లీ తెలంగాణకు నాయకత్వం వహించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని సర్పంచ్‌లు అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలుస్తున్నారని, ఆయన నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు

ఇన్ స్టా మూసేసిన రుచికా సింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 4, (న్యూస్ పల్స్)నాయకులపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు సాధారణం అయినప్పటికీ, రుచికా సింగ్ అనే 30 ఏళ్ల మహిళ ప్రధాని మోదీపై చేసిన ఒక్క రీల్ ఇప్పుడు సంచలనంగా మారింది. చేసిన తప్పు తెలుసుకుని క్షమాపణ చెప్పినా.. మోదీ తాను క్షమించానని ప్రకటించినా.. ఆ పొరపాటు రుచికా సింగ్‌ను వెంటాడుతూనే ఉంది. ప్రముఖులతో పోల్చి అనుచిత, అసభ్య పదజాలం ఉపయోగించి ప్రసారం చేసిన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ మూసుకోవాల్సి వచ్చింది. చివరకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు కూడా సమాజంలో ఉండే పరిస్థితి తేలుద.రుచికా సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా అవమానాత్మక శైలిలో ఉన్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో మోదీకి లింకు పెట్టి మాట్లాడింది. దానిని సోషల్ మీడియాలో పోస్టు చేసింది. పోస్ట్ వైరలవడంతోనే సింగ్ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ ఆపేసి, అజ్ఞాతంలోకి పోయింది. ఆమె తల్లిదండ్రులు కూడా మానసిక ఒత్తిడిని కారణంగా నగరం విడిచి వెళ్లారు.రుచికా సింగ్ వ్యాఖ్యలపై ఇప్పుడు నోయిడా పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. మహిళలు తనపైచేసిన వ్యాఖ్యలను పట్టించుకోవడం లేదని, క్షమించానని మోదీ స్వయంగా వీడియో విడుదల చేశారు. కానీ ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ పోలీసులు నమోదు చేస్తున్నారు. నోయిడా పోలీసులు రుచికా సింగ్ కోసం గాలిస్తున్నారు.చదువుకున్న యువత నేతలపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయ నాయకులపై అనభ్యగా వ్యాఖ్యానించడం చట్టపరంగా ఆరోజింపబడవచ్చు, కానీ సామాజిక పరిణామాలు మాత్రం వ్యక్తిగత హానికరమైన రీతిలో ఉంటాయి. రుచికా సింగ్ ఒక్క రీల్ ఇప్పుడు ఆమె అజ్ఞాతంలోకి వెళ్లేలా చేసింది. సోషల్ మీడియా ఎంత మేలు చేస్తుందో అంతే ప్రమాదకరం కూడా. ఈ విషయాన్ని యువత గుర్తించాలి.

కర్ణాటక కాంగ్రెస్ లో రాజీనామాల చిచ్చు


బెంగళూరు, ఆగస్టు 4, (న్యూస్ పల్స్)దక్షిణాది భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కర్ణాటక ఒకటి కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే తెలంగాణలో ముఖచిత్రం మారిపోయింది. తెలంగాణలో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం కూడా కర్ణాటకనే.కర్ణాటకలో ఇటీవల ముఖ్యమంత్రి మార్పు జరిగింది. సిద్ధ రామయ్య స్థానంలో డీకే శివకుమార్ కు అధిష్టానం ముఖ్యమంత్రి పీఠం అప్పగించింది. అప్పటినుంచి కర్ణాటక రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. కొంతమంది ఎమ్మెల్యేలు శివకుమార్ నాయకత్వాన్ని బహిరంగంగానే వ్యతిరేకించారు. తాజాగా కర్ణాటక రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఎమ్మెల్యేలు నిరసన స్వరాన్ని అందుకున్నారు. అంతటితోనే వారు ఆగిపోలేదు. ఏకంగా రాజీనామా అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు.క్యాబినెట్లో అవకాశాలు లభించకపోవడంతో చాలామంది ఎమ్మెల్యేలు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. ఇండి ఎమ్మెల్యే యశ్వంత రాయగౌడ వి పాటిల్ తన సభ్యత్వానికి రాజీనామా ప్రకటించారు. ఆయన తన రాజీనామా లేఖను డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాని కి అందజేశారు.సాగర్ ఎమ్మెల్యే బేలూరు గోపాలకృష్ణ కూడా తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. కేవలం తను మాత్రమే కాకుండా.. మరో 10 మంది ఎమ్మెల్యేలు కూడా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆయన ప్రకటించారు. శివకుమార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మంత్రివర్గాన్ని విస్తరించడానికి రంగం సిద్ధం చేశారు. కొత్తగా 20 మంది ఎమ్మెల్యేలను మంత్రులుగా చేయడానికి మార్గం సిద్ధమైంది. అయితే ఎమ్మెల్యేలు రాజీనామా చేయడం.. మిగతా ఎమ్మెల్యేలు తీవ్రమైన అసంతృప్తితో ఉండడంతో కర్ణాటక ప్రభుత్వంలో కుదుపు మొదలైంది. అందువల్లే కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం ఆలస్యం అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.పదిమంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే.. కర్ణాటకలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతాయి. ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం కూడా ఉంటుందని అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడికి గురైంది. దాని నుంచి కాస్త ఉపశమనం లభిస్తుండగానే ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. శివకుమార్ కు కన్నడ పగ్గాలు ఇవ్వడం ఇప్పటికీ కాంగ్రెస్ లో ఓ వర్గానికి ఏమాత్రం ఇష్టం లేదు. శివకుమార్ కింద పనిచేయడం చాలా మంది సీనియర్లకు ఏమాత్రం నచ్చడం లేదు. అందువల్లే వారంతా రాజీనామా చేస్తున్నారు. ఏకంగా పది ఎమ్మెల్యేలు రాజీనామాకు సిద్ధంగా ఉన్నారంటే కర్ణాటక కాంగ్రెస్ లో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన అంగన్వాడీ టీచర్లతో ఎస్ఐ దురుసు ప్రవర్తన

ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

మహబూబాబాద్,తమను వేధించిన వ్యక్తిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన అంగన్వాడీ టీచర్లతో ఎస్ఐ దురుసు ప్రవర్తన వివాదస్పదమయింది. ఎస్ఐ ప్రవర్తనతో మనస్తాపం చెందిన అంగన్ వాడీ టీచర్ స్పృహ కోల్పోయి కింద పడిపోయింది.మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దొనకొండ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తమను వేధించిన వ్యక్తిపై ఫిర్యాదు చేసేందుకు అంగన్వాడీ టీచర్ ఆవుల మంజుల, హెల్పర్ వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్కు వెళ్లారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ఇద్దరినీ, మహిళలని కూడా చూడకుండా దంతాలపల్లి ఎస్ఐ రవికుమార్ బూతులు తిడుతూ అవమానపరిచాడని మహిళలు ఆరోపించారు. తన ఛాంబర్లోకి పిలిచి ఎస్ఐ తమను, తమ భర్తలను అసభ్య పదజాలంతో దూషించాడని, తొక్కి చంపుతామని బెదిరించాడని బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేసారు.ఎస్ఐ ప్రవర్తనతో తీవ్ర ఆవేదనకు గురై స్పృహ కోల్పోయిన మంజులను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.తమను అవమానించిన ఎస్ఐను సస్పెండ్ చేయకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యమని, తొర్రూరు సీఐ గణేష్కు కుడా బాధితులు పిటిషన్ ఇచ్చారు.మేము బాత్రూమ్కు వెళ్తున్న వీడియోలు తీసి వేధిస్తున్నాడు. నరేష్ అనే వ్యక్తి గత మూడేళ్లుగా మేము స్కూల్లో పని చేస్తున్న సమయంలో మా పర్సనల్ వీడియోలు, బాత్రూమ్కు వెళ్లే వీడియోలు తీసి వేధిస్తున్నాడని దంతాలపల్లి ఎస్ఐ రవికుమార్కు ఈ నెల 1వ తేదీన ఫిర్యాదు చేశామని అన్నారు.ఎసస్ఐ మాకు న్యాయం చేస్తానని నమ్మించి, మమ్మల్ని పోలీస్ స్టేషన్కు పిలిపించి, మేము ఫిర్యాదు చేసిన వ్యక్తి ముందే మమ్మల్ని ఘోరంగా దూషిస్తూ అవమానపరిచాడని బాధతులు వాపోయారు.

జార్ఖండ్ లో రోడ్డెక్కున విద్యార్థులు



రాంచీ, ఆగస్టు 4, (న్యూస్ పల్స్)వేలాదిమంది విద్యార్థులు. చేతిలో ప్లకార్డులు.. అందరివి ఒకటే నినాదాలు.. మాకు న్యాయం జరగాలి.. అక్రమాలకు పాల్పడిన అధికారులు జైలుకు వెళ్లాలి.. విద్యార్థుల గోస పట్టని ప్రభుత్వం దిగిపోవాలి.. మొన్ననే కదా జంతర్ మంతర్ వద్ద నీట్ విద్యార్థులు ఆందోళన చేసింది. పోలీసులతో గొడవపడి.. తాము అనుకున్నది సాధించింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన దేశవ్యాప్తంగా ఉన్న యువత అగ్రహానికి ప్రతీకగా నిలిచింది. ఇటీవల చాలా రాష్ట్రాలలో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కు సంబంధించిన ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి. ఈ ఘటనల వెనుక ఉన్న వ్యక్తులను శిక్షించాలని.. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. చాలామంది విద్యార్థులు రోడ్లమీదకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి నిరాహార దీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం మీద తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.తాజాగా ఝార్ఖండ్ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు రోడ్లమీదకి వచ్చారు. అక్కడి ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్లు చేస్తున్నారు. దీనికి కాక్రోచ్ జనతా పార్టీ సపోర్ట్ చేస్తుంది.. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో క్లీన్ జెపిఎస్సి పేరుతో వేలాది మంది విద్యార్థులు నిరవధికంగా నిరాహార దీక్ష చేస్తున్నారు. విద్యార్థి సంఘం నాయకుడు దేవేంద్రనాథ్ మహా ఆధ్వర్యంలో ఈ ఆందోళన మొదలైంది.. దీనంతటికీ ప్రధాన కారణం జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. జార్ఖండ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల్లో భారీగా అక్రమాలు.. ప్రశ్నా పత్రాలు లీకేజీ జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. రాజధాని రాంచీలో విద్యార్థులు ఉద్యమాన్ని ఉధృతం చేశారు.. ఏప్రిల్ 19న ఈ పరీక్ష నిర్వహించారు. ఫలితాలను జూలైలో విడుదల చేశారు. నిర్ణీత మార్కులను ప్రకటించకపోవడంతో స్టూడెంట్స్ లో ఆగ్రహం మొదలైంది. దీనికి తోడు ఓఎంఆర్ షీట్ల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మెయిన్స్ పరీక్షను.. పరీక్షలను వాయిదా వేసింది. దీంతో పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. ఈ వివాదం ముదిరిపోవడంతో జెపి ఎస్ఎస్సి చైర్మన్ తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈ వ్యవహారం మీద విచారణకు ఆదేశించారు. 11 మందిని అరెస్ట్ చేయించారు. అయితే ప్రభుత్వ చర్యల మీద విద్యార్థులు సానుకూలంగా లేరు.. వారంతా సీబీఐ దర్యాప్తును కోరుతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో న్యాయం చేయలేకపోతే ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని.. ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కల్వకుంట్ల ఫ్యామిలిలో రచ్చ...

హైదరాబాద్, ఆగస్టు 4 (న్యూస్ పల్స్)కేసీఆర్.. తెలంగాణ ఉద్యమ నాయకుడిగా దేశమంతటికీ పరిచయం. తెలంగాణ రాష్ట్రం సాధనలో ముందు నడిచిన నేతగా రాష్ట్రంలో ఆయనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉంది. రాష్ట్రం సాధించాక పదేళ్లు ఆయన సీఎంగా పనిచేశారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో బీఆర్ఎస్‌లో ముసలం మొదలంది. చివరకు కేసీఆర్ కుటుంబంలోనూ చిచ్చు రేగింది. కూతురు కవిత సొంత పార్టీపైనే విమర్శలు చేయడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో కవిత ఇటీవలే టీఆర్ఎస్ పార్టీ ప్రకటించి రాజకీయాలు చేస్తోంది. ఈ క్రమంలో పార్టీని వీడిన తర్వాత కవితపై ఆమె సోదరుడు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె వేరే మార్గం ఎంచుకున్నారని, పార్టీలో ఇచ్చిన అవకాశాలపై కృతజ్ఞత లేదని వ్యక్తం చేశాడు.కవిత గతంలో బీఆర్ఎస్‌లో ఎంపీ, ఎమ్మెల్సీగా పనిచేశారు. రాష్ట్ర ఉద్యమం, పార్టీ పెరుగుదలలో కుటుంబం కీలక పాత్ర పోషించింది. అయితే ఇటీవల కాలంలో ఆమె పార్టీ నుంచి వేరుపడి స్వతంత్ర మార్గం అనుసరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పార్టీ నాయకత్వం, నిర్ణయాలపై విమర్శలు చేశారు. దీనికి ప్రతిస్పందనగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.కవితకు పార్టీలో తగిన అవకాశాలు కల్పించినట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాష్ట్రం కోసం జీవితం అంకితం చేశారని గుర్తు చేస్తూ, అలాంటి వ్యక్తిపై విమర్శల దాడి చేయడం ప్రత్యర్థులకు భిన్నంగా లేదని అభిప్రాయపడ్డారు. అవకాశాలు ఇచ్చినా కృతజ్ఞత లేకుండా పార్టీ అధినేతను విమర్శించడం సహించలేని విషయమని సూచించారు. “అలానే కానివ్వండి” అనే స్వరం ద్వారా ఆమె మార్గంపై దూరం పాటించే వైఖరిని వ్యక్తం చేశారు.బీఆర్ఎస్‌లో కేసీఆర్, కేటీఆర్, కవిత మధ్య వారసత్వం, నాయకత్వ పంపిణీపై అంతర్గత ఒత్తిళ్లు ఉన్నాయని గత నివేదికలు సూచిస్తున్నాయి. కవిత స్వతంత్ర పార్టీ ప్రయత్నాలు లేదా విమర్శలు ఈ ఘర్షణను బహిరంగం చేశాయి. కేటీఆర్ వ్యాఖ్యలు పార్టీలోని మిగతా నాయకులకు, కార్యకర్తలకు సందేశం ఇచ్చే ప్రయత్నంగా చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో కుటుంబ ఆధారిత పార్టీలు సాధారణం. అయితే ఇలాంటి విభేదాలు ఓటర్లలో గందరగోళం సృష్టించవచ్చు. ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు ఐక్యత అవసరం.కేటీఆర్ పార్టీని బలోపేతం చేసే ప్రయత్నంలో ఉన్నారు. కవిత తన మార్గంలో కొనసాగితే రాష్ట్ర రాజకీయాల్లో మరో కొత్త శక్తి ఆవిర్భవించే అవకాశం ఉంది. రెండు వైపులా ఉన్న విమర్శలు ప్రజల్లో నిరాశను కలిగించకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది.



మల్లన్నకు అంత ఈజీ కాదా

వరంగల్, ఆగస్టు 4, (న్యూస్ పల్స్)చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పుడు తన పొలిటికల్ కెరీర్‌లో మరో అత్యంత కీలకమైన సవాలుకు సిద్ధమవుతున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన ఆయన, ప్రస్తుతం ఆ పార్టీతో తెగదెంపలు చేసుకుని సొంత రాజకీయం మొదలుపెట్టారు. 2027 మార్చితో ముగియనున్న తన పదవీకాలం ముగిసేలోపు, మళ్లీ అదే స్థానం నుంచి సొంత వేదిక ద్వారా గెలవాలనే లక్ష్యంతో సుదీర్ఘ పాదయాత్రకు రూపకల్పన చేస్తున్నారు.గతానికి ? ఇప్పటికీ మల్లన్న పొలిటికల్ ఇమేజ్‌లో చాలా స్పష్టమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను, అక్రమాలను ప్రశ్నించే హార్డ్‌కోర్ వాయిస్‌గా యూత్‌లో, ముఖ్యంగా నిరుద్యోగులు, పట్టభద్రుల్లో విశేషమైన ఆదరణ ఉండేది. ఆ ప్లాట్‌ఫామ్ తెచ్చిపెట్టిన క్రేజ్‌తోనే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడే లక్షలాది ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు.



ఆ తదనంతరం కాంగ్రెస్‌లో చేరి బిఆర్ఎస్, బిజెపిలను తట్టుకుని ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించగలిగారు.కానీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ దారి ఆయన పునాదులనే కదిలించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోం?ది. బీసీ ఐక్యత పేరుతో కొన్ని వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే.. ఇతర కులాలను, సమాజంలోని కొన్ని విభాగాలను తీవ్రంగా విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆయనకున్న న్యూట్రల్ , ఎడ్యుకేటెడ్ ఓటర్ బేస్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. విద్యావంతులు, గ్రాడ్యుయేట్లు ఓటేసే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో కులగణనలు, వ్యక్తిగత దూషణల కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు, శాసనమండలిలో వారి గళాన్ని వినిపించే వైఖరికే ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో మల్లన్న తన పాత ఇమేజ్‌ను పోగొట్టుకుని, దారి తప్పిన రాజకీయ నాయకుడిగా మిగిలిపోయారనే అభిప్రాయం సోషల్ మీడియా వేదికల్లో బాహాటంగానే కనిపిస్తోంది.రాబోయే ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలం, ఓటు బ్యాంకు అండగా ఉండవు. అటు బిఆర్ఎస్, ఇటు బిజెపిలు ఈ విస్తృత నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి పక్కా వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కాంగ్రెస్ వైపు నుంచి అధికారిక అభ్యర్థి బరిలో ఉంటారు. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోరులో, కాంగ్రెస్ ఓటు బ్యాంక్ లేకుండా, కేవలం సొంత ఇమేజ్‌తో బరిలోకి దిగడం మల్లన్నకు పెద్ద సాహసమే. అందుకే పాదయాత్ర ద్వారా మళ్లీ జనం లోకి వెళ్లి కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలని ఆయన భావిస్తున్నారు.పాదయాత్రలు చేయడం తేలికే అయినా.. పట్టభద్రుల మైండ్ సెట్‌ను మార్చడం మల్లన్నకు అంత సులభం కాకపోవచ్చు. ఒకవేళ పాదయాత్ర చేసినా కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఓట్లు సాధించలేకపోతే, గత కొన్నేళ్లుగా ఆయన చుట్టూ ఉన్న పొలిటికల్ హడావుడి, బిల్డప్ అంతా ఒక ప్రసహనంలా మారే ప్రమాదం ఉంది. తన పాత ఇమేజ్‌ను తిరిగి తెచ్చుకుని, విద్యావంతులను మెప్పించే సరైన అజెండాతో వస్తే తప్ప.. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల పోరు మల్లన్నకు ఆశాజనకంగా ఉండే అవకాశం కనిపించడం లేదు.

మండలి ఎన్నికల సంగ్రామం షురూ....

హైదరాబాద్, ఆగస్టు 4 (న్యూస్ పల్స్)తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి పెరుగుతోంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ , భారతీయ జనతా పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఢిల్లీ వేదికగా నిర్వహించిన సమావేశంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత కోసం ప్రతి స్థానానికి ముగ్గురు బలమైన అభ్యర్థులతో కూడిన ప్యానెల్ జాబితాను తయారు చేసి సమర్పించాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులను ఆదేశించింది.వరంగల్ ? ఖమ్మం ? నల్గొండ పట్టభద్రుల స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తీన్మార్ మల్లన్న , మహబూబ్‌నగర్ ? రంగారెడ్డి ? హైదరాబాద్ పట్టభద్రుల స్థానం నుంచి బిఆర్ఎస్ ప్రతినిధిగా ఎన్నికైన సురభి వాణీదేవిల పదవీకాలం 29 మార్చి 2027× నాటితో ముగియనుంది. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడంతో ఖాళీ అయిన వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానానికి 2024 జూన్ ఉపఎన్నికలో నెగ్గిన తీన్మార్ మల్లన్న గడువుతో పాటు, 2021లో హైదరాబాద్ గ్రాడ్యుయేట్ స్థానం నుంచి గెలిచిన వాణీదేవిల ఆరేళ్ల గడువు ఒకే తేదీతో ముగుస్తుండటంతో.. నిబంధనల ప్రకారం మార్చి 2027 లోగా ఎన్నికలు జరగనున్నాయి.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియ సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా, చాలా సంక్లిష్టంగా, దీర్ఘకాలికంగా సాగుతుంది. సాధారణ అసెంబ్లీ లేదా లోక్‌సభ ఓటర్ల జాబితా లాగా ఇది పాత జాబితా కొనసాగింపు కాకుండా, ప్రతి ఎన్నికకూ కొత్తగా నిబంధనల ప్రకారం సున్నా నుంచి ఓటర్లను నమోదు చేయాల్సి ఉంటుంది . నోటిఫికేషన్ లేదా పోలింగ్‌కు దాదాపు 4 నుంచి 5 నెలల ముందే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. త్వరలో ఓటర్ల జాబితా రూపకల్పన ప్రారంభించనున్నారు. అప్పటికే అభ్యర్థుల్ని ప్రకటిస్తే వారే ఓటర్ల నమోదు బాధ్యత తీసుకుంటారు.సాధారణ శాసనసభ లేదా లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సమాజంలోని విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు , నిరుద్యోగుల రాజకీయ ఓటింగ్ ధోరణికి అద్దం పడతాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన విద్యా, ఉద్యోగ, యువజన విధానాలపై పట్టభద్రుల అభిప్రాయం ఎలా ఉందో తెలుసుకోవడానికి ఇది ఒక కొలమానంగా మారనుంది. ఈ స్థానం పరిధిలో అనేక మంది యువత, గ్రూప్స్ అభ్యర్థులు ఓటర్లుగా ఉండటంతో రాజకీయ పార్టీలన్నీ రాబోయే ఎన్నికల్లో వీరి ప్రభావం ఎంతవరకూ ఉంటుందో అంచనా వేస్తున్నాయి. సమర్థవంతమైన, ప్రజల్లో పట్టున్న విద్యావంతులనే అభ్యర్థులుగా బరిలోకి దించాలన్న కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలతో సమర్థమైన యువ నేతల్ని అభ్యర్థులు ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని చూపించాలనుకునే బీఆర్ఎస్, బీజేపీ కూడా శక్తివంచన లేకుండా ప్రయత్నించనున్నాయి.

వడివడిగా బుల్లెట్ రైల్ హబ్ పనులు

హైదరాబాద్, ఆగస్టు 4 (న్యూస్ పల్స్) బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు గురించి తాజా సమాచారం అందుతోంది. శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో నిర్మాణం జరుగుతున్న బుల్లెట్ రైల్‌హబ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ నుంచి వికారాబాద్ మీదుగా పుణెకు వెళ్లనున్న రైలు మార్గాన్ని సూచిస్తున్నాయి. గూగుల్ ఎర్త్ మ్యాప్‌లలో ఈ మార్గం బహదూర్‌గూడ, సయ్యం?గూడ, పెద్ద గోల్కొండ, నందిపల్లి, రషీద్?గూడ, మంఖాల్ గ్రామాల మీదుగా వెళ్తుందని స్పష్టం అవుతోంది. రైతులు ఈ మార్గం వల్ల తమ భూములు భూసేకరణకు గురవుతాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అధికారులు ఈ భూములను సేకరించనున్నట్లు రైతులకు తెలిపారు. అయితే, 6 గ్రామాల్లో భూసేకరణ జరుగుతుందనే అనుమానంతో రైతులు రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లారు. కానీ, వారికి సరైన సమాచారం అందించలేదు. దీంతో రైతుల ఆందోళన పెరిగింది. సోషల్? మీడియాలో వైరల్ అయిన ఫొటోలు పరిశీలిస్తే, రైలు మార్గం సుమారు 60 మీటర్ల వెడల్పు ఉందని తెలుస్తోంది. రైతులు తమ భూములలో 40 శాతం కోల్పోయామని, మళ్లీ భూసేకరణ జరిగితే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూగుల్? మ్యాప్?లోని మార్గాన్ని పరిశీలిస్తే, 3 నెలల క్రితం ఈ మార్గం ఖరారు చేయబడినట్లు తెలుస్తోంది. స్థానికులు చెప్పినట్లుగా, రైలు మార్గానికి సంబంధించిన గుర్తులను తమ పొలాలు, రహదారికి సమీపంలో వేశారని సమాచారం అందుతోంది. రవాణా రంగ నిపుణులు, హైస్పీడ్‌రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు ఈ మార్గం కోసం కన్సల్టెంట్‌ను సంప్రదించినట్లు చెబుతున్నారు. బుల్లెట్? ట్రైన్? మార్గం 17.5 మీటర్ల వెడల్పు ఉంటుందని, మొదటి మూడు రకాల అలైన్?మెంట్లు చిత్రీకరించుకున్నాక ఒకటే మార్గాన్ని ఖరారు చేస్తారని అధికారులు వివరించారు. రాజేంద్రనగర్? ఆర్డీవో శ్రీధర్? మాట్లాడుతూ, తమకు ఏ సమాచారం లేదని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.కేంద్ర ప్రభుత్వం 2026 బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఏడు హై-స్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్ ప్రాజెక్టులను ప్రకటించింది. ఇందులో మూడు ప్రాజెక్టులు హైదరాబాద్ కేంద్రంగా ఉంటాయి. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల పరిధిలో నిర్మాణం కానున్నాయి.

ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ



దమ్మపేట, ఆగస్టు 04 : ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ ప్రతి గూడెంలో ఆదివాసి జెండా ఎగురవేయాలన్నారు. జాతి ఐక్యతను చాటాలని, తమ జాతి హక్కులను, చట్టాలను రక్షించడానికి బలమైన ఉద్యమం నిర్మించే దిశగా యువత అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున ప్రతి ఒక్క ఆదివాసి జిల్లా ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంలో నిర్వహించే భారీ సాంస్కృతిక ర్యాలీకి హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు తెల్లం రామారావు దొర, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు గడ్డం వెంకటేశ్వరరావు, ఆదివాసి యువ నాయకుడు కాకా రమేశ్ పాల్గొన్నారు.

విస్తరిస్తున్న వాషింగ్టన్ వైల్డ్‌ఫైర్..

వేలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు..!



అమెరికాలో అగ్నికీలలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. వాషింగ్టన్ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతాన్ని కార్చిచ్చు దహించి వేస్తుండగా సమీపంలోని వేల మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాజాగా మరో 60 వేలమందిని తాత్కాలిక శిబిరాలకు పంపారు. మంటలకు కారణమని భావిస్తున్న స్పోకేన్ చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.ప్రస్తుతం వాషింగ్టన్ వ్యాప్తంగా 16 ప్రదేశాల్లో కార్చిచ్చు విస్తరించింది. వందల భవనాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్పోకేన్ ప్రాంతంలో మంటలు కొనసాగుతుండటంతో వాటిని అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బలమైన గాలులు, పొడి వాతావరణం కారణంగా మంటలను నియంత్రించడం సవాలుగా మారింది. నష్టం తీవ్రతను అంచనా వేస్తున్నట్లు స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ వెల్లడించారు.తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడిన తర్వాత.. వాషింగ్టన్ రాష్ట్ర గవర్నర్ బాబ్ ఫెర్గూసన్ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తుండటంతో ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.మంటలు చెలరేగుతున్న ప్రాంతాల్లో డ్రోన్‌లు ఎగరవేయడంపై నిషేధం విధిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాంటి చర్యలను చట్టవిరుద్ధంగా పరిగణిస్తామన్నారు. సహాయక చర్యలు కొనసాగిస్తున్న అగ్నిమాపక విమానాలు, హెలికాప్టర్లకు అవి ఆటంకం కలిగిస్తున్నాయని, డ్రోన్‌ల వల్ల ఆదివారం 26 సార్లు అగ్నిమాపక కార్యకలాపాలకు అంతరాయం కలిగిందని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి: యూఎస్‌పీసీ

హైదరాబాద్ , ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిర్ణయించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యూఎస్‌పీసీ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యా శాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యా రంగానికి 15% నిధుల కేటాయింపు హామీని విస్మరించారని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపునకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యూకేజీ కే పరిమితం చేశారని, ప్రీ ప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకే నడపాలి. కానీ ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4 వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12 తర్వాత తమ పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని వారు వాపోయారు. ప్రాథమిక విద్యకు అవరోధంగా ఉన్న జీవో 25ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.నూతన జిల్లాలకు డీఈవో, రెవెన్యూ డివిజన్ కు ఒక డిప్యూటీ ఈవో, అన్ని మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని, పీవో 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 15 లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, టెట్ లో సర్వీసు వెయిటేజీ ఇవ్వాలని, స్పెషల్ టెట్ ను సబ్జెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, విద్యా శాఖ లో బీసీ, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్, ఎయిడెడ్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షోభంలోకి వ్యవసాయ రంగం'

అప్పులు చెల్లించమని రైతులపై బ్యాంకర్ల ఒత్తిడి
లో వోల్టేజితో కాలుతున్న మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు
పిఓఎల్ రద్దు చేయడం దురదృష్టకరం
తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

ముఖ్య నాయకులతో కలిసి ఆర్డీఓకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వినతి

కోదాడ, ఆగస్టు 04 : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని, ఎన్నికల్లో రైతులకు అండగా ఉంటామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతులను దగా చేస్తుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ముఖ్య నాయకులతో



కలిసి ఆర్డీఓ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట సాగు ప్రారంభ దశలో రైతులకు అవసరమైన క్రాప్ లోన్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. గతంలో ప్రతి ఏడాది రైతులు పంట రుణాలను సులభంగా రెన్యువల్ చేసుకునేవారని ప్రస్తుతం బ్యాంకులో పాత రుణ మొత్తం అసలు, వడ్డీతో సహా చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని రైతులను తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. బ్యాంకులపై ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడం వల్ల రైతులు మళ్లీ ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకోలేదని, లో వోల్టేజీతో మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, సకాలంలో నీరందకపోతే పంటలు ఎండిపోవడం ఖాయమని ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా ఎరువుల రవాణాకిచ్చే ప్రైవేట్ ఆన్ లారీ (ఎఫ్ ఓ ఎల్) రాయితీని ప్రభుత్వం రద్దు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ నిర్ణయంతో పీఏసీఎస్‌లు, డీలర్లు అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తుందని ఈ భారం రైతుల పైనే పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎరువుల కొరత ఏర్పడి బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సిరెడ్డి, ఎస్.కె నయీమ్, చీమ నరేష్, కె.బాబు, తుమ్మలపల్లి భాస్కర్, ఉపేందర్ గౌడ్, గొర్రె రాజేష్, చీమ శ్రీనివాస్, గట్ల కోటేశ్వరరావు, కరీముల్లా, బాబా, చలిగంటి వెంకట్, మండల పార్టీ బాధ్యులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

రాజీనామా చేస్తానంటే.. వెంటనే ఓకే చేస్తా..

అసంతృప్తులపై కర్ణాటక సీఎం వ్యాఖ్య


కర్ణాటక , ఇటీవల కర్ణాటక కేబినెట్ విస్తరణ నేపథ్యంలో మంత్రిగా అవకాశం దక్కని అనేక మంది ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంతో సీఎం డీకే శివకుమార్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అవకాశాలు వచ్చే



వరకూ సహనంతో ఉండాలని హితవు పలికారు. ఎవరైనా రాజీనామా చేస్తానంటే నిమిషాల్లో ఒకే చేస్తానని కూడా తేల్చి చెప్పారు. తాజా కేబినెట్ విస్తరణలో 20 మంది ఎమ్మెల్యేలకు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకు సీఎం డీకే తన కేబినెట్‌ను విస్తరించారు.కేబినెట్‌లో చోటు దక్కక అసంతృప్తితో ఉన్న వారిని ఉద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రిజైన్ చేస్తానన్న వారంతా రాజకీయాలు చేస్తున్నట్టే. రాజీనామా చేస్తాననే వారిని ఎవ్వరూ ఆపలేరు. కానీ వారికి ఒక పార్టీ కావాలి. పార్టీలో భవిష్యత్తు కావాలి. అలాంటివి ఇచ్చేది తమ పార్టీ ఒక్కటే. ధరమ్ సింగ్ సమయంలో నేను రాజీనామా చేసుండొచ్చు. ఆ తరువాత కూడా అలాంటి పరిస్థితులు వచ్చాయి. సిద్ధరామయ్య సమయంలో కూడా ఈ పరిస్థితి ఉంది. ఆ సమయాల్లో నేను ఓర్పుతో ఉండలేదా? వీరేంద్ర పాటిల్ హయాంలో బంగారప్పకు అవకాశం దక్కలేదు. ఖర్గే సాబ్‌కు అవకాశం రాలేదు. ఒకసమయంలో ధరమ్ సింగ్‌కు ఛాన్స్ రాలేదు. వారిలో కొందరు ఆ తరువాత సీఎంలు కాలేదా? ఇలాంటి సమయాల్లో ఓర్పుతో ఉండాలి. పార్టీ మనకు చాలా ముఖ్యం' అని అన్నారు. ఇక అసంతృప్తి ఎమ్మెల్యేలను బుజ్జగించే పనిని పార్టీ సీనియర్ లీడర్లకు సీఎం అప్పగించారు.

ఎయిర్ ఇండియా విమానంలో తీవ్రమైన కుదుపులు.. 12 మందికి స్వల్ప గాయాలు

ఢిల్లీ, ఆగస్టు 4: ఫుకెట్ (థాయ్‌లాండ్) నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానంలో మంగళవారం అనుకోకుండా తీవ్ర కుదుపులు(టర్బులెన్స్) ఏర్పడ్డాయి. ఈ ఊహించని పరిణామంతో విమానంలో ప్రయాణిస్తున్న 12 మంది గాయపడగా, విమానం కూడా స్వల్పంగా దెబ్బతిన్నట్లు సమాచారం.ఇవాళ (ఆగస్టు 4) 134 మంది ప్రయాణికులతో ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ంఎ379 ఎయిర్ ఇండియా విమానం గాల్లో ఉండగా ఒక్కసారిగా తీవ్రమైన కుదుపులకు గురైంది. దీనివల్ల క్షణాల



వ్యవధిలోనే విమానం ఎత్తు (ఆల్టిట్యూడ్) ఒక్కసారిగా పడిపోయింది.విమానంలో ఉన్న ప్రయాణికుడు ఒకరు మాట్లాడుతూ... 'విమానం ఎత్తు ఒక్కసారిగా తగ్గిపోవడంతో నా తల పైభాగంలో (రూఫ్) గట్టిగా తగిలి కింద పడిపోయాను' అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హఠాత్ పరిణామంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.ఈ ఘటనపై ఎయిర్ ఇండియా యాజమాన్యం అధికారికంగా స్పందించింది. విమానం ప్రయాణికులందరితో సురక్షితంగా ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండ్ అయిందని, అందరూ క్షేమంగా బయటకు వచ్చారని తెలిపింది. గాయపడిన 12 మందిలో ఇద్దరు క్యాబిన్ సిబ్బంది కూడా ఉన్నారు. ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదని, కేవలం స్వల్ప గాయాలే అయ్యాయని సంస్థ పేర్కొంది. ముందు జాగ్రత్త చర్యగా బాధితులను ఎయిర్‌పోర్టులోని వైద్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే తమ మొదటి ప్రాధాన్యమని, బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామని విమాన సంస్థ తెలిపింది. ఈ ఘటనపై సంబంధిత అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు వెల్లడించింది.

కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు హర్యానాకు ఛాన్స్ ఇవ్వాలి: కాంగ్రెస్ ఎంపీ

కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని హర్యానాకు ఇవ్వాలని రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు కాంప్లెక్స్ ముందు నిరసనకు దిగారు. ఇతర రాష్ట్రాలతో కలిసి సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని అయినా ఇవ్వాలని కోరారు. భారత క్రీడావిజయాల్లో హర్యానా పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. కాబట్టి, 2030లో జరగనున్న



కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశం తమకు దక్కాలని చెప్పారు.ఈ నిరసనల్లో కాంగ్రెస్ ఎంపీ దీపీందర్ సింగ్ హుడాతో పాటు ఎంపీలు జైప్రకాశ్, వరుణ్ ముల్లానా, సత్‌పాల్ బ్రహ్మచారి, కర్మవీర్ బౌద్ధ కూడా పాల్గొన్నారు. హర్యానా మెడల్స్ తెస్తుంటే గుజరాత్‌లో క్రీడలు నిర్వహించడమేమిటని వారు ప్రశ్నించారు. క్రీడల వేదికపై కేంద్రం మరోసారి పునరాలోచించాలని కోరారు. హర్యానా హక్కులు సాధించుకునేందుకు తామ[illegible] అంతర్జాతీయ క్రీడా ఈవెంట్స్‌లో అత్యధిక మె[illegible]గంలో యావత్ దేశంలో హర్యానా ముందుందని [illegible]

ఈ20 పెట్రోల్ అమ్మకండి..

పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం



చండీఘడ్: దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్‌అమ్మకాలపై ఆందోళన వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహనాలు దెబ్బతింటున్నట్లు కొన్ని చోట్ల ఫిర్యాదులు అందాయి. అయితే దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ ఇవాళ పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం పాస్ చేశారు. 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాన్ని పంజాబ్ అసెంబ్లీ వ్యతిరేకించింది. ఇథనాల్ ఫ్రీ పెట్రోల్‌తో పాటు ఈ20 పెట్రోల్ ఎంపిక చేసుకునే అవకాశం వినియోగదారుడికి ఇవ్వాలని సభలో డిమాండ్ చేశారు. ఈ20 పెట్రోల్‌కు తగినట్లు డిజైన్ లేని వాహనాల్లో దాన్ని వాడడం వల్ల సమస్యలు వస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.ఈ20 వాడకం వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గుతుంది కాబట్టి, ఆ సామర్థ్యానికి తగినట్లు ఈ20 పెట్రోల్ రిటేల్ ధరను తగ్గించాలని తీర్మానంలో కోరారు. ఆటోమొబైల్ ఇంజినీర్లు, పెట్రోలియం నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, వినియోగదారుల సంఘాలు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో ఓ వ్యక్తిగత కమిటీని ఏర్పాటు చేసి ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై సమగ్రమైన స్టడీ చేయాలని తీర్మానంలో కేంద్రాన్ని డిమాండ్ చేశారు.సీఎం భగవంత్‌మాన్ సింగ్ సభలో మాట్లాడుతూ సుమారు 45వేల వాహనాలపై ఈ20 ప్రభావం గురించి స్టడీ చేశారని, ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడడం వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గినట్లు గుర్తించారని, కొన్ని వాహనాలు పాడైనట్లు కూడా ఆయన చెప్పారు. అసలు ఈ20 విషయంలో ప్రధాని మోదీ ఎందుకు పట్టుపట్టారని, ఇదేమీ నితిన్ గడ్కరీ కుమారుడికి లాభం తెచ్చిపెట్టదని, ఎందుకంటే మోదీకి, ఆయనకు మంచి సంబంధాలు లేవని, కేవలం అమెరికా ప్రభుత్వ వత్తిడి వల్లే ఈ20 పెట్రోల్ అమ్మకాలపై కేంద్రం వత్తిడి తెస్తున్నట్లు భగవంత్ మాన్ ఆరోపించారు.ఇటీవల అమెరికాతో వంద బిలియన్ల డాలర్ల వాణిజ్య ఒప్పందం కుదిరిందని, దానిలో భాగంగా 5 బిలియన్ల లీటర్ల ఇథనాల్ భారత్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని భగవంత్‌మాన్ ఆరోపించారు

అస్సాం సీఆర్‌పీఎఫ్ క్యాంపులో విషాదం..

సహచరులపై కాల్పులకు దిగిన జవాన్



అస్సాం నగావ్ జిల్లాలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ క్యాంపులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. డ్యూటీలో ఉన్న ఓ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇద్దరు సహచర జవాన్లపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ కాల్పుల ఘటనలో మరో జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి.మంగళవారం ఉదయం సుమారు 7:00 గంటల సమయంలో బల్లాని ప్రేమబరం అనే ఏఎస్ఐ 34వ బెటాలియన్ క్యాంప్ ఆఫీస్ మెయిన్ గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఇంతలో గార్డు రూమ్‌లోని ఇన్‌సాస్ రైఫిల్ తీసుకుని వెనుక వైపు వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న విష్ణు ప్రసాద్ బఘేల్‌పై కాల్పులకు దిగడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. ఆ వెంటనే డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం అక్కడికి వెళ్లిన రామ్‌నవల్ సింగ్ యాదవ్‌పైనా కాల్పులు జరపడంతో.. ఆయన కూడా స్పాట్ డెడ్ అయ్యారు. ఆ తర్వాత మనే గోవింద్ శ్రీపుల్ అనే జవాన్‌నూ కాల్చారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఈ కాల్పుల అనంతరం శిబిరంలోని బ్యారక్‌లోకి వెళ్లిన ప్రేమబరం.. అదే తుపాకీతో తానూ కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు అధికారులు తెలిపారు. గాయపడిన జవాన్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్టు వెల్లడించారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న సీనియర్ సీఆర్పీఎఫ్, పోలీస్ అధికారులు.. వెంటనే శిబిరానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాల్పులకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన వెనుక వ్యక్తిగత లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ సాగిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఉదయనిధి స్టాలిన్‌కు ఊరట.. విచారణ అనంతరం

విడుదల చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం..

నటి త్రిషకు సంబంధించిన వివాదాస్పద వ్యాఖ్యల కేసులో డీఎంకే నేత, తమిళనాడు అసెంబ్లీ ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ పూర్తయిన వెంటనే ఆయనను విడుదల చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వరకు బలవంతపు చర్యలు తీసుకోవద్దని కూడా స్పష్టం చేసిందికావేరి జలాల అంశంపై జరిగిన ఆందోళన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు నటి త్రిషను ఉద్దేశించినవిగా విమర్శలు రావడంతో వివాదం చెలరేగింది. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి చెన్నైలోని నివానం నుంచి ఆయనను అదుపులోకి తీసుకున్నారుఈ చర్యను సవాల్ చేస్తూ డీఎంకే తరఫున మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టిన న్యాయస్థానం, విచారణ కోసం అవసరమైతే ప్రశ్నించవచ్చని, ఆ తర్వాత ఉదయనిధిని విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అలాగే తదుపరి విచారణ వరకు ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని సూచించింది.



టైర్ 1 సిటీగా మారుతున్న విశాఖ



విశాఖపట్టణం, ఆగస్టు 4, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణం ఇప్పుడు కేవలం మాటలకే పరిమితం కాకుండా, కళ్లముందే నిజమై కనిపిస్తోంది. ఒకప్పుడు సాధారణంగా ఉన్న రహదారులు నేడు విశాలమైన నేషనల్ హైవేలుగా మారుతుంటే, ఏళ్ల తరబడి ఖాళీగా పడి ఉన్న భూములు ఇప్పుడు పరిశ్రమలతో కళకళలాడుతున్నాయి. సాంప్రదాయ పద్ధతుల్లో సాగిన పాఠశాలలు డిజిటల్ తరగతులుగా రూపాంతరం చెందుతున్నాయి. అలాగే సముద్ర తీర ప్రాంతాల్లో ఆధునిక వసతులతో ఫిషింగ్ హార్బర్లు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రతి రంగంలోనూ వస్తున్న ఈ మార్పులు రాష్ట్ర భవిష్యత్తుపై ప్రజలకు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి.ఈ ప్రగతికి సాగరతీర నగరం విశాఖపట్నం నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో ఎన్నో ఆకర్షణీయమైన ప్రకటనలు వచ్చినప్పటికీ, ఆచరణలో అనుకున్నంత పురోగతి కనిపించలేదు. కానీ ఇప్పుడు విశాఖ నగరం కొత్త రూపు దిద్దుకుంటోంది. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్ మిట్టల్ ప్రాజెక్టులతో పాటు భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో వైజాగ్ ప్రాంతం పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. ప్రకటనల స్థానంలో క్షేత్రస్థాయి ఫలితాలు కనిపిస్తుండటంతో నగర రూపురేఖలు వేగంగా మారుతున్నాయి.పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు వేగంగా లభిస్తుండటంతో పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు మొగ్గు చూపుతున్నారు. భూముల కేటాయింపు నుంచి పనుల ప్రారంభం వరకు ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. దీనివల్ల నిన్నటివరకు నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలు కార్పొరేట్ ఆఫీసులు, పరిశ్రమలతో నిండిపోతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన యువత.. మళ్లీ సొంత రాష్ట్రానికే తిరిగి వచ్చి ఉద్యోగాలు సాధించే వాతావరణం నెలకొంటోంది.కేవలం పెద్ద ప్రాజెక్టులే కాకుండా విద్య, నైపుణ్య శిక్షణ, తీర ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారు.ఐటీఐల ఆధునీకరణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సముద్ర తీరాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ మత్స్యకారుల సంక్షేమం నుంచి విదేశీ ఎగుమతుల వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ఈ పురోగతి కేవలం ఒక నినాదం కాదు.. అది నిర్మిస్తున్న రహదారులు, తీర్చిదిద్దుతున్న తరగతి గదులు, యువతకు లభిస్తున్న ఉద్యోగాల రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రణాళికాబద్ధమైన ఆలోచనలు, వేగవంతమైన పనులతో రాష్ట్రం వికాస బాటలో వేగంగా అడుగులు వేస్తోంది.

తేలప్రోలు వద్ద ఘోర ప్రమాదం

డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టిన ప్రైవేటు బస్సు
25 మంది ప్రయాణికులకు గాయాలు - ఏడుగురి పరిస్థితి విషమం
చెన్నై నుంచి వైజాగ్ వెళ్తుండగా అర్ధరాత్రి దాటాక ప్రమాదం
క్షతగాత్రులు పిన్నమనేని ఆస్పత్రికి తరలింపు

ఉంగుటూరు, ఆగస్టు 4 ,ఉంగుటూరు మండలం తేలప్రోలు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చెన్నై నుంచి వైజాగ్‌కు 25 మంది ప్రయాణికులతో వెళ్తున్న 'బి.ఎల్.ఎమ్' (ఒఓ) ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. అనంతరం రహదారిపైనే పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది గాయపడగా, వారిలో ఏడుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా అరుపులు, కేకలతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సు మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్లే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిందని ఘటనా స్థలంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే ఉంగుటూరు పోలీసులు, 108 అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను బస్సు అద్దాలు పగలగొట్టి వెలుపలికి తీశారు. గాయపడిన 18 మంది స్వల్ప గాయాలతో బయటపడగా, తీవ్రంగా గాయపడిన ఏడుగురిని తక్షణ చికిత్స నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వెంటనే స్పందించి క్రేన్ సహాయంతో బోల్తా పడిన బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమా లేక బస్సులో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు

కడప విమానాశ్రయం మాజీ అధికారికి 3 ఏళ్ల జైలు శిక్ష

కర్నూలు,లంచం తీసుకుంటూ పట్టుబడిన మాజీ ఇంచార్జ్ డైరెక్టర్ ంఉఓ ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్ కు 3ఏళ్ల జైలు శిక్ష, 50 వేలు జరిమానా కర్నూలు సిబిఐ ప్రత్యేక కోర్టు విధించింది. పెండింగ్ బిల్లులను త్వరగా మంజూరుతో పాటు

సంస్థను బ్లాక్ లిస్ట్ లో పెట్టకుండా ఉండేందుకు ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్ లంచం డిమాండ్ చేసాడు. 2005 జులై 24 వ తేదీ 25 వేలు లంచం తీసుకుంటూ ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్ సిబిఐకి దొరికిపోయాడు. అతనిపై 2016 ఫిబ్రవరి 29న చార్జీషిట్ దాఖలు అయింది.

నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు

విజయవాడ, ఆగస్టు 4,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కేంద్రంగా రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లోకేష్ క్రియాశీలక పాత్ర పోషిస్తుండటం అందరికి తెలిసిందే. అధికార పక్షంలో ఆయనే కీలకమయ్యారు. ప్రతిపక్షం కూడా ఆయన పైనే గురి పెట్టింది. దాంతో లోకేష్ గ్రాఫ్ పెరిగింది.ముఖ్యమంత్రి చంద్రబాబు వయసు 75 సంవత్సరాలు దాటాయి. ఇప్పటికే అయన నాలుగు సార్లు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేశారు. 16 ఏళు ్ల ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఏకైక ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. అయితే రాబోయే కాలంలో తన కుమారుడు లోకేష్ ను ముఖ్యమంత్రిని చేయాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు.ఇప్పటికే టీడీపీ వర్కింగ్ ప్రసిడెంట్ పదవి అప్పజెప్పారు. పార్టీ కీలక అంశాలని కుమారుడికి అప్పగించేశారు. ఇక మిగిలింది పట్టాభిషేకం. పరిపాలనా అనుభవం కోసం విదేశాలు తిప్పుతున్నారు. తరచుగా ఢిల్లీకి పంపిస్తున్నారు. కేంద్రంలోని మంత్రులతో మాట్లాడిస్తున్నారు. ప్రభుత్వంలో తీసుకునే కీలక నిర్ణయాలలో లోకేష్ ను ఇన్వాల్వ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. రాబోయే కాలంలో లోకేష్ ముఖ్యమంత్రి కావడం ఖాయంగా కనిపిస్తుంది.ప్రతిపక్ష వైసీపీ లోకేష్ ను టార్గెట్ చేసుకొని రాజకీయాలు చేస్తుండడం గమనించవచ్చు. నిన్నా మొన్నటి వరకు లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించిన వైసీపీ ఇప్పుడు డీఎస్సి అక్రమాల గురించి పోరాటం స్టార్ట్ చేసింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తరహాలోనే లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేసింది.అంటే భవిష్యత్తులో తాము లోకేష్ తోనే పోరాడాల్సి వస్తుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థిర నిర్ణయానికి వచ్చారని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను సైతం పక్కన పెట్టి లోకేష్ పై బాణం ఎక్కు పెట్టడం దీనికి నిదర్శనమని పేర్కొంటున్నారు . మొత్తం మీద అటు అధికార పార్టీ లోకేష్ చుట్టూ తిరుగుతుంటే ఇటు ప్రతిపక్షం కూడా లోకేష్ కేంద్రంగానే విమర్శలు గుప్పిస్తుండడం విశేషం.



ఆశావహులు.. అదుపు తప్పుతున్నారా

కాకినాడ, ఆగస్టు 4, టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ధిక్కార స్వరం వినిపిస్తున్నారా? స్థానికంగా తన హవాను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారా? అంటే.. అవుననే సమాధానమే టీడీపీ వర్గాల్లో వినిపిస్తోంది. కాకినాడ పోర్టును విస్తరించే పనులకు ఆయన సుముఖంగానే ఉన్నా.. పార్టీ పరంగా ఆయన వ్యవహరించడం లేదనే టాక్ వినిపిస్తోంది. కాకినాడ పోర్టకు కోన పోర్టుగా పేరు పెట్టాలన్నది యనమల డిమాండ్. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న పైగా ఎవరికీ లేని ఈ డిమాండ్ విషయంలో యనమల స్థానికతను పురిగొల్పుతున్నారు. పోర్టుకు అవసరమైన భూములు ఇస్తోంది కోనసీమ ప్రాంత రైతులని, కాబట్టి.. పోర్టుకు కోన పేరు పెట్టాలన్నది యనమల సూచన. ఇదే ఇప్పుడు డిమాండ్‌గా మారుతోంది. ఈ నెల 20లోగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని కోన పోర్టుగా పేరు నిర్ధారించాలని.. లేకపోతే, ప్రజల ఆకాంక్షల మేరకు తాను కూడా వ్యవహరిస్తానని చెప్పు కొచ్చారు. ఈ వ్యవహారంపై ఆయన ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. తాజాగా స్థానికులతో భేటీ కావడం మరింత ఆసక్తిగా మారింది. కోన సీమ రైతు ల నుంచి భూములు తీసుకుంటున్నారని, అలాంటప్పుడు కాకినాడ పోర్టు అని పేరు ఎందుకని ఆయన చెబుతున్నారు. అయితే.. వాస్తవానికి.. భూములు తీసుకున్నంత మాత్రాన అదే పేరును ఉంచాలని ఏమీ లేదు. ఈ విషయం తెలిసినప్పటికీ.. యనమల మాత్రం తన దారి తనదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా ఇది పెద్ద ఉద్యమంగా మారాలని ఆయన ఆకాంక్షిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రాధాన్యం కొరవడడంతోనే.. ఇటు పార్టీలోను, అటు ప్రభుత్వంలోనూ యనమల ప్రాధాన్యం ఒకప్పుడు ఉన్నట్టుగా ఇప్పుడు లేదు. గతంలో తిప్పిన చక్రం.. ఇప్పుడు మూలబడినట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. ఎమ్మెల్సీగా రిటైరైన తర్వాత.. రాజ్యసభ ఆశించారు. లేదా గవర్నర్ గిరీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ రెండు చేజారుతున్నా యి. పైగా తన ముందు రాజకీయాల్లోకి వచ్చిన వారికి పదవులు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ తనను పూర్తిగా పక్కన పెడుతోందని గ్రహిస్తున్న ఆయన.. ఇలా.. కీలక విషయాలపై ఫోకస్ చేశారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మాట.



వేమండలో '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం'

పాల్గొన్న విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే
ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన యార్లగడ్డ
వేమండలో ఇప్పటివరకు రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని వెల్లడి
కలవపాముల రహదారి అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధిస్తామని హామీ
గత ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే యార్లగడ్డ విమర్శ

గన్నవరం,ఉంగుటూరు మండలం వేమండ గ్రామంలో సోమవారం నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం ? అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అంతకుముందు రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గన్నవరం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో రహదారులు దయనీయ స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. గత ఐదేళ్లలో గుడివాడ – కలవపాముల, తరిగొప్పుల – మానికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దెబ్బతిన్న రహదారులలో సుమారు 80 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వేమండ గ్రామంలో ఇప్పటికే ఆరు సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ మరమ్మతులు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు, హెడ్ పంప్ ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్ పథకం కింద రూ. 37 లక్షల వ్యయంతో 250 విద్యుత్ స్తంభాల మార్పిడి, ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు, రూ. 12 లక్షలతో వ్యవసాయ విద్యుత్ సేవల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ. 1.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. కలవపాముల రహదారి అభివృద్ధికి సుమారు రూ. 1.70 కోట్లుఅవసరమవుతున్నాయని, ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో మిగిలిన సిమెంట్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులకు కూడా ప్రాధాన్యమిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజలు కోరిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉంగుటూరు మండల తహసీల్దార్ జలాది విమల కుమారి, ఎంపీడీవో ఈ సత్య కుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, తోట నాగభూషణం, కాపుదాసి సునీల్, గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, తేలప్రోలు పిఏసిఎస్ చైర్ పర్సన్ ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, ఉయ్యూరు మురళి, బెజవాడ నాగేశ్వరరావు, రాజబోయిన శివాజీ, తుమ్మల జగదీష్, యర్రగుంట్ల వినోద్, చల్లగుల్ల సందీప్, కొసరాజు సాయిరాం, పసుపులేటి సుబ్బారావు, కానూళ్ల శ్రీను, పకీరు, పొన్నగంటి బాలకృష్ణ, వెనిగళ్ళ రాము, గంప భీమయ్య, యలమంచిలి దినేష్, మరీదు శ్రీను, శివరాం, తుమ్మల లత, పొట్లూరి భువనేశ్వరి జనసేన నాయకులు చిమట రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో కీలక ముందడుగు



విజయవాడ, ఆగస్టు 4, అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సర్వేను అధికారికంగా ప్రారంభించారు. భూసేకరణ వల్ల స్థానిక ప్రజలు, వ్యాపార సంస్థలపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, వారికి తగిన పరిహారం , పునరావాసం కల్పించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశం.దీనికి సంబంధించి త్వరలోనే ప్రభావిత ప్రాంతాల ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారు.విజయవాడ మెట్రో మొదటి విడత నిర్మాణంలో భాగంగా రెండు ప్రధాన కారిడార్లను ప్రతిపాదించారు. మొదటి కారిడార్ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుండి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు విస్తరించి ఉండగా.. రెండో కారిడార్ ఖఔఐ నుండి పెనమలూరు వరకు సాగనుంది. ఈ రెండింటికీ ప్రధాన రవాణా కేంద్రమైన పండిట్ నెహ్రూ బస్ స్టుషన్ వద్దే రెండు ప్రత్యేక మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లతో పాటు గన్నవరం ఎయిర్‌పోర్టును మెట్రో ద్వారా అనుసంధానించడం వల్ల ప్రయాణికులకు సత్వర , సునాయాస రవాణా వసతి లభించనుంది.గతంలో నిలిచిపోయిన ఈ మెట్రో ప్రాజెక్ట్‌ను మళ్లీ పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండటంతో విజయవాడ , అమరావతి పరినర ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్‌కు అవసరమైన అనుమతులు, డిజైన్లు , భూసేకరణకు సంబంధించిన పనులు సమాంతరంగా జరుగుతుండటం ప్రాజెక్ట్ అమలుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోంది. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ , ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన వెంటనే భూసేకరణ తుది ప్రక్రియ ప్రారంభమై, విజయవాడ మెట్రో నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి.

కిడ్నాప్ కేసులో వైసీపీ నేత అరెస్ట్..

గుజరాత్‌లో పట్టుబడ్డ మాజీ ఎమ్మెల్యే ముస్తఫా
కొద్ది రోజులుగా తప్పించుకు తిరుగుతున్న ముస్తఫా
టెక్నికల్ నిఘా సాయంతో నిందితుడి ఆచూకీ గుర్తింపు

వైసీపీ నేత, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాను పోలీసులు అరెస్ట్ చేశారు. కిడ్నాప్ కేసుకు సంబంధించి గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న ఆయన్ను నూజివీడు పోలీసులు గుజరాత్‌లో అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక నిఘా సాయంతో ముస్తఫా ఆచూకీని గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.కేసు నేపథ్యం: ఇటీవల పొగాకు లోడ్‌తో వెళ్తున్న ఒక వాహనాన్ని ముస్తఫా కుమారుడు, అతని అనుచరులు అడ్డగించారు. ఆ వాహనంలో ఉన్న పొగాకు వ్యాపారితో పాటు మరో వ్యక్తిని కిడ్నాప్ చేసి బంధించారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు రంగంలోకి దిగి కిడ్నాప్‌కు గురైన ఇద్దరినీ సురక్షితంగా విడిపించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేశారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా తొలుత ముస్తఫా కుమారుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అయితే, విచారణలో ఈ కిడ్నాప్‌తో మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు కూడా సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో ఆయనపై కిడ్నాప్, బెదిరింపుల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా అజ్ఞాతంలోకి వెళ్లగా, చివరకు సాంకేతిక ఆధారాలతో ఆయన గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. ముస్తఫా అరెస్ట్‌ను పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు.

ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధికి చర్యలు

ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట,పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. ప్రస్తుతం దాదాపు 200 పడకలతో అన్ని విభాగాల్లో సర్జరీలు, ఓపీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ నెలలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించి మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకే హెచ్ డి ఎస్ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాత ఏరియా ఆసుపత్రి భవనాలను తొలగించి అక్కడ తల్లీబిడ్డల ఆరోగ్య సముదాయం నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు ఇప్పటికే నాబార్డు ద్వారా రూ.55 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మంత్రి పర్యటన తర్వాత నిర్మాణ ప్రణాళికలను ఖరారు చేస్తామన్నారు. అలాగే రోగులకు తాగునీటి సరఫరా, రెస్ట్ రూమ్స్ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు డాక్టర్ భారతీ దేవి, మిరియాల వెంకట సుబ్బమ్మ, తవ్వా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ న్యూస్

యూఏఈ వేదికగా మహిళల టీ20 ఆసియా కప్ 2026..!



ఇటీవల జరిగిన ఐసీసీ మహిళా టీ20 ప్రపంచ కప్2026 క్రికెట్ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే మహిళల క్రికెట్ లో మరో ఆసక్తికర సమరం త్వరలో జరగనుంది. మహిళల టీ20 ఆసియా కప్ 2026 టోర్నీకి సంబంధించిన తేదీలను ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సభ్య దేశాలకు అంతర్గతంగా తెలియజేసినట్లు క్రీడా వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ టోర్నీ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు జరిగే అవకాశం ఉందని సమాచారం.క్రీడా వర్గాల సమాచారం ప్రకారం.. ఈ ఐసీసీ టోర్నీకి యూఏఈ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే మ్యాచులు, వేదికలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ వివరాలను ఏసీసీ అధికారికంగా ప్రకటించలేదు. ఆసియా ఖండానికి సంబంధించిన ఈ ఐసీసీ టోర్నీలో భారత్, పాకిస్థాన్‌తో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, మలేసియా, థాయ్‌లాండ్, యూఏఈ జట్లు పోటీపడతాయని తెలుస్తోంది.ఈ నేపథ్యంలో మరోసారి భారత్–పాకిస్థాన్ మహిళల మ్యాచ్ చూసే అవకాశం లభించనుందని క్రికెట్ అభిమానులను భావిస్తున్నారు. అయితే ఈ రెండు జట్లు ఎప్పుడు తలపడతాయనే విషయం తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. ఏసీసీ పూర్తి షెడ్యూల్ రిలీజ్ చేసిన తర్వాత ఇండియా, పాక్ మ్యాచ్‌పై స్పష్టత వస్తుంది.సభ్య దేశాలకు ఏసీసీ పంపిన సమాచార ప్రకారం.. అన్నీ జట్లు ఆగస్టు 27న యూఏఈకి చేరుకోవాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 13న ఫైనల్ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. టోర్నీ వేదికకు సంబంధించిన తుది నిర్ణయం, పరిపాలనా అనుమతులు పూర్తికాకపోవడంతోనే ఏసీసీ షెడ్యూల్ విడుదల ఆలస్యానికి కారణంగా తెలుస్తోంది. ఆసియా కప్‌లో భారత్‌దే ఆధిపత్యం నడుస్తోంది. ఇప్పటివరకు టీమిండియా ఏడు టైటిళ్లు గెలిచింది. అయితే 2024లో జరిగిన చివరి ఎడిషన్‌లో శ్రీలంక ఫైనల్లో భారత్ ఓడింది.

బుమ్రా స్థానంలో నబీ.. షమీని ఎంపిక చేయకపోవడానికి కారణం అదేనా!



భారత సీనియర్ బౌలర్ మహ్మద్ షమీ భవిష్యత్తుపై చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. గాయం కారణంగా జట్టుకు దూరమైనప్పటికీ.. దేశవాళీలో అద్భుతంగా రాణిస్తున్న సంగతి తెలిసిందే. అయినా జాతీయ జట్టు నుంచి అతడికి పిలుపు అందడం లేదు. తాజాగా స్టార్ పేసర్ బుమ్రా గాయం కారణంగా శ్రీలంకతో జరగనున్న టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో షమీని కాకుండా.. యువ పేసర్ ఆకిబ్ నబీని బీసీసీఐ రిప్లేస్ చేసింది. దీనిపై అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. షమీని ఎందుకు ఎంపిక చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ షమీ భవిష్యత్తుపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.మహ్మద్ షమీ చివరి సారిగా 2023లో భారత జట్టు తరపున టెస్టు మ్యాచ్ ఆడాడు. గాయాల నుంచి కోలుకున్న తర్వాత రంజీ ట్రోఫీలో వరుసగా ఆకట్టుకునే ప్రదర్శనలు చేసినప్పటికీ జాతీయ జట్టులోకి తిరిగి పిలుపు రాలేదు. ఈ విషయంపై అజిత్ అగార్కర్ స్పందించాడు. టెస్టు క్రికెట్ ఆడేందుకు అవసరమైన ఫిట్‌నెస్ ప్రస్తుతం షమీకి లేదని స్పష్టం చేశాడు. అందుకే షమీని జాతీయ జట్టులోకి ఎంపిక చేయడం లేదని తెలిపాడు. అయితే గత ఏడు రంజీ మ్యాచ్‌ల్లో షమీ 37 వికెట్లు తీసి మూడు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అదే సీజన్‌లో ఆకిబ్ నబీ 60 వికెట్లు పడగొట్టి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. దీంతో శ్రీలంక టెస్టు సిరీస్‌కు అతడికి అవకాశం లభించింది.ఆకిబ్ నబీ ఎంపికతో షమీకి బీసీసీఐ పంపిన సందేశం స్పష్టమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. టెస్టు జట్టులోకి తిరిగి రావాలంటే దేశవాళీ టోర్నీల్లో యువ పేసర్ల కంటే మెరుగైన ప్రదర్శన చేయడమే కాకుండా పూర్తి ఫిట్‌నెస్‌ను కూడా నిరూపించుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇకపై యువ పేసర్లు కేవలం జట్టులో సంఖ్యను పెంచడానికి కాకుండా, తుది జట్టులో చోటు కోసం నేరుగా సీనియర్లతో పోటీ పడుతున్న పరిస్థితి ఏర్పడిందని విశ్లేషిస్తున్నారు.

డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు: భారత్ వైదొలిగితే..

యువ పేసర్లకు బీసీసీఐ ఛాన్స్!

భారత టెస్టు జట్టులో కొత్త పేస్ దళాన్ని తీర్చిదిద్దే పనిలో బీసీసీఐ నిమగ్నమైనట్లు తెలుస్తోంది. టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తరుచూ గాయాల బారిన పడుతుండటంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బుమ్రానే ప్రధాన అస్త్రంగా కొనసాగించినప్పటికీ.. అతడిపై ఎక్కువగా ఆధారపడకుండా భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయ పేసర్లను సిద్ధం చేయాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసు నుంచి భారత్ వైదొలిగితే.. బీసీసీఐ ముగ్గురు యువ పేసర్లను బరిలోకి దింపే అవకాశం ఉంది.బుమ్రాతో పాటు



మహ్మద్ సిరాజ్ ప్రస్తుతం భారత జట్టులో నమ్మకమైన పేసర్‌గా ఉన్నప్పటికీ.. వీరిద్దరి తర్వాత అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణించే వేగవంతమైన బౌలర్ల కొరత కనిపిస్తోందని బీసీసీఐ భావిస్తోంది. మరోవైపు గాయం నుంచి కోలుకుని రంజీ ట్రోఫీలో బెంగాల్ తరఫున అద్భుతంగా రాణించిన భారత సీనియర్ బౌలర్ మహ్మద్ షమీకి టీమ్ మేనేజ్‌మెంట్ అవకాశాలు ఇవ్వడం లేదు. అతడు ఇక భారత జట్టు భవిష్యత్తు ప్రణాళికల్లో లేకపోవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వేగంతో పాటు బౌన్స్ రాబట్టగల పేసర్లపై బీసీసీఐ దృష్టి సారించింది. తుషార్ దేశ్‌పాండే, గుర్జప్‌నీత్ సింగ్, విదర్భ పేసర్ నచికేత్ భూటే ప్రదర్శనను సెలెక్టర్లు నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి భారత్ వైదొలిగితే.. ఈ యువ పేసర్లకు వెంటనే జట్టులోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉన్న భారత్.. ఇంకా తొమ్మిది టెస్టులు ఆడాల్సి ఉంది. ఇందులో కనీసం 7-8 విజయాలు సాధిస్తేనే ఫైనల్‌కు చేరే అవకాశాలు ఉంటాయి. ఆగస్టు 7 నుంచి శ్రీలంకతో టెస్టు, అనంతరం న్యూజిలాండ్ పర్యటనకు భారత్ వెళ్లనుంది. ఈ రెండు పర్యటనల్లోనే టీమిండియా డబ్ల్యూటీసీ భవితవ్యం తెలిసిపోతుంది. 2024-25 ఆస్ట్రేలియా పర్యటనలో బుమ్రాపై భారత్ ఎంతగా ఆధారపడిందో స్పష్టంగా కనిపించింది. అతడు వికెట్లు తీయలేని సందర్భాల్లో భారత బౌలింగ్ ప్రభావం తగ్గిపోయింది. ఇంగ్లండ్ పర్యటనలో కూడా బుమ్రా అన్ని టెస్టులకు దూరమవడంతో పేస్ విభాగంలో లోటు స్పష్టమైంది. ఎడమచేతి పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇవ్వకపోవడం, అంశుల్ కాంబోజ్ ఒక్క మ్యాచ్‌కే పరిమితం కావడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం శ్రీలంక సిరీస్‌కు ఆకిబ్ నబీకి అవకాశం ఇవ్వడం ద్వారా కొత్త పేసర్లను పరీక్షించే ప్రక్రియను బీసీసీఐ కొనసాగిస్తోంది.


పీసీబీ కీలక నిర్ణయం..పాక్ బ్యాటింగ్ కోచ్‌గా స్మిత్



పాకిస్థాన్ పురుషుల క్రికెట్ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ మైకేల్ స్మిత్ నియమితులయ్యాడు. ఈ మేరకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధికారిక ప్రకటనను విడుదల చేసింది. స్మిత్ ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనుండగా.. టెస్టులు, వన్డేలు, టీ20లతో సహా మూడు ఫార్మాట్లలోనూ పాక్ బ్యాటర్లకు శిక్షణ అందించనున్నాడు. ఈ నెల19 నుంచి ఇంగ్లండ్‌తో ప్రారంభం కానున్న మూడు టెస్టుల సిరీస్‌కు ముందే స్మిత్ జట్టుతో చేరనున్నాడు.గత కొంతకాలంగా పాక్ బ్యాటర్లు విదేశీ గడ్డపై ఆశించిన స్థాయిలో రాణించలేకపోతుండటంతో బోర్డు తీవ్ర ఆందోళన చెందింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో వెనుకబడటం, నిలకడలేని బ్యాటింగ్ తీరు జట్టు పతనాన్ని శాసిస్తుండటంతో ఈ లోపాలను సరిదిద్ది పటిష్ఠమైన టాప్, మిడిల్ ఆర్డర్‌ను తీర్చిదిద్దే బాధ్యతను పీసీబీ.. స్మిత్‌కు అప్పగించింది. 2003 నుండి 2013 మధ్య కాలంలో ప్రొఫెషనల్ క్రికెట్ ఆడిన మైకేల్ స్మిత్, 89 ఫస్ట్ క్లాస్, 72 లిస్ట్-ఎ, 16 టీ20 మ్యాచ్‌లలో మొత్తంగా 7,029 పరుగులు సాధించాడు. ఇందులో 9 సెంచరీలు, 40 అర్ధసెంచరీలు ఉన్నాయి.ఆటగాడిగా వీడ్కోలు పలికిన అనంతరం లెవెల్ 4 కోచింగ్ డిగ్రీ పూర్తి చేసిన స్మిత్, శిక్షకుడిగా మంచి గుర్తింపు సంపాదించాడు. పీఎస్ఎల్ (పాకిస్థాన్ సూపర్ లీగ్) లో ఇస్లామాబాద్ యునైటెడ్, కరాచీ కింగ్స్, ముల్తాన్ సుల్తాన్స్ వంటి ప్రముఖ ఫ్రాంచైజీల్లో పని చేశాడు. ఇది పాక్ ఆటగాళ్లకు కలసివచ్చే అంశం. ఆస్ట్రేలియా బిగ్‌బాష్ లీగ్‌లో హోబర్ట్ హరికేన్స్, టాస్మేనియా జట్లకు కూడా బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. స్మిత్ రాకతోనైనా పాకిస్థాన్ బ్యాటింగ్ విభాగం మళ్లీ గాడిలో పడుతుందో లేదో చూడాలి.

విషాదం.. గుండెపోటుతో బ్రెజిల్ ప్లేయర్ మృతి

క్రీడా రంగంలో విషాదం చోటుచేసుకుంది. బ్రెజిల్‌కు చెందిన 34 ఏళ్ల యూఎఫ్‌సీ ఫైటర్ అలన్ నాసిమెంటో గుండెపోటుతో మరణించాడు. సోమవారం ఉదయం నిద్రలోనే అలన్ తుదిశ్వాస విడిచినట్లు యూఎఫ్‌సీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఫ్లైవెయిట్ విభాగంలో అతడి చివరి పోరాటం జూన్‌లో జరిగింది. అందులో మిచ్



రాపోసో చేతిలో అలన్ ఓడిపోయాడు.యూఎఫ్‌సీ తెలిపిన వివరాల ప్రకారం... అలన్‌కు సోమవారం తెల్లవారుజామున నిద్రలోనే గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యుల సమాచారంతో వైద్యులు వచ్చి సీపీఆర్ చేశారు. కానీ అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇక ప్రొఫెషనల్ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్(ఎంఎంఏ) కెరీర్‌లో ఫైటర్‌గా 22 విజయాలు, 7 ఓటములను చవిశాడు.గతంలో కోచ్ డియెగో లిమా వద్ద నాసిమెంటో శిక్షణ తీసుకున్నాడు. ఈ సమయంలోనే మాజీ యూఎఫ్‌సీ లైట్‌వెయిట్ ఛాంపియన్ చార్లెస్ ఒలివెరా, యూఎఫ్‌సీ లైట్‌వెయిట్ ఎల్వెస్ బ్రెనర్‌తో సహా పలువురు స్టార్ బ్రెజిలియన్ ఫైటర్లతో తలపడ్డాడు. మరోవైపు యూఎఫ్‌సీ అలన్ నాసిమెంటో చేసిన ఎంఎంఏ ఫైటర్‌గా సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. అలన్ ఒక నైపుణ్యం ఉన్న క్రీడాకారుడని, పరిపూర్ణ ఎంఎంఏ ఫైటర్ అని కొనియాడింది. అలాన్ తన పట్టుదల, వినయం, గౌరవం, పోరాట స్ఫూర్తితో అందరికీ స్ఫూర్తినిచ్చాడని పేర్కొంది.

లుసానె డైమండ్ లీగ్: బరిలోకి దిగనున్న నీరజ్ చోప్రా



కామన్వెల్త్ గేమ్స్ 2026లో రజత పతకం సాధించిన భారత జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా తదుపరి సవాల్‌కు సిద్ధమయ్యాడు. ఆగస్టు 21 నుంచి స్విట్జర్లాండ్ వేదికగా జరగనున్న ప్రతిష్ఠాత్మక లుసానె డైమండ్ లీగ్‌లో బరిలోకి దిగనున్నాడు. ఈ టోర్నీలో కామన్వెల్త్ స్వర్ణ విజేత, శ్రీలంక స్టార్ రమేశ్ పతిరాజె, పాకిస్థాన్ ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్‌తో పాటు ప్రపంచ అగ్రశ్రేణి జావెలిన్ త్రోయర్లు పాల్గొననుండటంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ ఫైనల్లో రమేశ్ పతిరాజె 89.75 మీటర్ల త్రోతో స్వర్ణం సాధించగా, నీరజ్ 85.83 మీటర్ల అత్యుత్తమ ప్రయత్నంతో రజత పతకం దక్కించుకున్నాడు. ఇప్పుడు డైమండ్ లీగ్‌లో ఈ ఇద్దరూ మరోసారి తలపడనున్నారు. వీరితో పాటు ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన కేశోర్న్ వాల్కాట్, గ్రెనడా స్టార్ అండర్సన్ పీటర్స్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన యాకుబ్ వాడ్లెజ్, జర్మనీకి చెందిన జూలియన్ వెబర్, అమెరికా అథ్లెట్ కర్టిస్ థాంప్సన్ కూడా బరిలోకి దిగనున్నారు.కామన్వెల్త్ గేమ్స్‌లో నీరజ్ తొలి ప్రయత్నంలో 80.97 మీటర్లు, రెండో ప్రయత్నంలో 85.83 మీటర్లు విసిరాడు. ఆ తర్వాత 81.29, 80.73 మీటర్ల త్రోలు నమోదు చేయగా, చివరి రెండు ప్రయత్నాలు ఫౌల్ అయ్యాయి. దీంతో రజతంతో సరిపెట్టుకున్నాడు. కాగా సెప్టెంబరులో ప్రారంభమయ్యే ఆసియా క్రీడలకు ముందు లుసానె డైమండ్ లీగ్ కీలక పరీక్షగా భావిస్తున్నారు. నీరజ్, అర్షద్ నదీమ్, రమేశ్ పతిరాజె మధ్య జరిగే ఈ పోరు అథ్లెటిక్స్ అభిమానులను మరోసారి అలరించనుంది.

ఆ ఒక్కసారే కేఎల్ రాహుల్ కోపంగా ఉండటం చూశా: వసీం జాఫర్

టీమిండియా స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ గురించి మాజీ ప్లేయర్ వసీం జాఫర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా ఉన్న సమయంలో ఒక్కసారి మాత్రమే రాహుల్ కోపంగా ఉండటం చూశానని తెలిపాడు. అతడు ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటాడని.. ఆ ఒక్కసారి మాత్రం తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు వెల్లడించాడు. గెలవాల్సిన మ్యాచ్‌లను చేజార్చుకోవడం రాహుల్‌ను తీవ్ర నిరాశకు గురిచేసిందని తెలిపాడు. ఈ క్రమంలో వసీం జాఫర్ ఓ క్రికెట్ షోలో మాట్లాడుతూ'కేఎల్ రాహుల్ చాలా కూల్‌గా ఉంటాడు. మైదానంలోనూ, బయటా కోపం చూపించడం చాలా అరుదు. కానీ నేను పంజాబ్ కింగ్స్‌లో బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న సమయంలో గెలవాల్సిన మ్యాచ్‌లను చివరి ఓవర్లలో కోల్పోయాం. ఒక మ్యాచ్ ఓడిన తర్వాత అతడు నిజంగానే తీవ్ర అసహనానికి గురయ్యాడు. హద్దులు దాటి ఏమీ మాట్లాడలేదు. కానీ జట్టు ఆటతీరుపై ఎంత నిరాశ చెందాడో అతడి ముఖంలో కనిపించింది. రాహుల్‌ను కోపంగా చూసిన ఏకైక సందర్భం అదే' అని వసీం జాఫర్ వెల్లడించాడు.కేఎల్ రాహుల్ 2018 నుంచి 2021 వరకు పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించడంతో పాటు కెప్టెన్‌గా కూడా వ్యవహరించాడు. 2020లో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నప్పటికీ, ఆ జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది. 2020, 2021 సీజన్లలో ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతుల్లో స్వల్ప తేడాతో ఓడిన మ్యాచ్‌లు పంజాబ్ ప్లే ఆఫ్స్ అవకాశాలను దెబ్బతీశాయి. పంజాబ్ తరఫున రాహుల్ 55 మ్యాచ్‌ల్లో 2,548 పరుగులు చేసి ఆ జట్టు తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అనంతరం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు ఆడిన అతడు, 2025 నుంచి ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున మరోసారి దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. 2026 సీజన్‌లో 593 పరుగులు చేసి, ఐపీఎల్‌లో భారత బ్యాటర్‌గా తొలి 150+ స్కోరు (152×) నమోదు చేసి మరో అరుదైన ఘనత సాధించాడు.

నూతన కార్యాలయంను ప్రారంభోత్సవం

ఘనంగా జక్కిడి రఘువీర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు
ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



తెలంగాణ పవర్ న్యూస్ మన్సూరాబాద్ డివిజన్ ఎల్బీనగర్ ఆగస్టు మన్సూరాబాద్ డివిజన్ నందు నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎల్.బి.నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు జన హృదయ నేత దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. విచ్చేసి మన్సూరాబాద్ డివిజన్ యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా విజయశ్రీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారి చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ప్రజా నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రఘువీర్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక ప్రజాసేవ కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహించారని ఇంకా మునుముందు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పుట్టినరోజు వేడుకలను చేసుకోవాలని వారన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ భారస పార్టీ నాయకులు,ఉద్యమకారులు,కార్యకర్తలు, యువత మహిళలు అభిమానులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇండియా మొబైల్ కాంగ్రెస్ 10వ ఎడిషన్‌కు థీమ్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య



న్యూఢిల్లీ, ఆగష్టు 2026: భారతదేశపు ప్రముఖ డిజిటల్ సాంకేతిక వేదిక అయిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, కేంద్ర కమ్యూనికేషన్లు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా 2026 ఇండియా మొబైల్ కాంగ్రెస్ అధికారిక థీమ్‌గా సరిహద్దులు లేని విస్తరణను ప్రకటించారు. ఈ కార్యక్రమం 2026 అక్టోబర్ 7 నుంచి 10 వరకు న్యూఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించబడుతుంది. "స్కేల్ విత్‌ౌట్ బౌండరీస్ " అనే థీమ్ భౌగోళిక సరిహద్దులు, పరిశ్రమలు లేదా సాంకేతిక పరిమితులను దాటి ఆవిష్కరణలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపగల భవిష్యత్తును ప్రతిబింబిస్తుంది.

భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖకు చెందిన టెలికమ్యూనికేషన్స్ విభాగం సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ 10వ ఎడిషన్‌కు 1.5 లక్షలకు పైగా సందర్శకులు, 100కుపైగా దేశాల నుంచి 300కుపైగా ఎగ్జిబిటర్ల భాగస్వాములు, అలాగే 1,500కుపైగా సాంకేతిక వినియోగ నమూనాలు ప్రదర్శించబడనున్నాయి.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా మాట్లాడుతూ, "సాంకేతికత ప్రతి పౌరుడికి చేరుకున్నప్పుడు అవకాశాలు ఏర్పడతాయి. అవకాశాలు ప్రతి పౌరుడికి చేరుకున్నప్పుడు మార్పు అనివార్యమవుతుంది. ప్రస్తుతం 133 కోట్ల మంది చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉన్నాయి. డేటా ధరలు జీబీకి ?287 నుంచి సుమారు ?8కు తగ్గాయి. ఇదే ప్రజాస్వామ్యీకరణ, ఇదే అంత్యోదయం. ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టితో 'ఆత్మనిర్భర్ భారత్' 'వికసిత భారత్ 2047' లక్ష్యాల సాధనకు ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేస్తున్నాయి." అని పేర్కొన్నారు. కేంద్ర కమ్యూనికేషన్లు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని మాట్లాడుతూ,"గత పదేళ్లలో భారత టెలికాం రంగం అపూర్వమైన మార్పును సాధించింది. దే డిజిటల్ కమ్యూనికేషన్స్ కమిషన్ చైర్మన్ టెలికమ్యూనికేషన్స్ కార్యదర్శి అమిత్ అగర్వాల్ మాట్లాడుతూ, "ఐ ఎం సిలో పాల్గొనేవారి సంఖ్య, సాంకేతిక వినియోగ నమూనాలు గణనీయంగా పెరిగాయి. సి ఓ ఏ ఐ చైర్మన్ రాహుల్ వాట్స్ మాట్లాడుతూ,"2017లో 32 వేల నందర్శకులు, 100 ఎగ్జిబిటర్లతో ప్రారంభమైన ఐ ఎం సి , ఇప్పుడు భారతదేశపు సాంకేతిక వేదికగా రూపాంతరం చెందింది అని పేర్కొన్నారు. ఐ ఎం సి యొక్క ప్రముఖ స్టార్టప్ కార్యక్రమం ఆస్పైర్ ద్వారా 400కుపైగా స్టార్టప్‌లు, 300కుపైగా పెట్టుబడిదారులు, ఇంక్యుబేటర్లు, యాక్సిలరేటర్లు వెంచర్ క్యాపిటల్ సంస్థలు పాల్గొంటాయి నిలున్తున్నదని మరోసారి నిరూపించనుంది. థీమ్ ఆవిష్కరణకు ముందు, ఐ ఎం సి సత్వా కన్సల్టింగ్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో టెలికాం అనుబంధ రంగాల సుస్థిరత కార్పొరేట్ సామాజిక బాధ్యత నాయకులు పాల్గొన్నారు. వ్యాపార లక్ష్యాలు భారత అభివృద్ధి కార్యక్రమాలు ఎలా పరస్పరం బలోపేతం చేసుకుంటాయో, అలాగే సి ఎస్ ర్ వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా సమగ్ర అభివృద్ధిని ఎలా సాధించవచ్చో ఈ సమావేశంలో చర్చించారు.

యాదిరెడ్డిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి. బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్



నాగర్ కర్నూల్ (తెలంగాణ పవర్) జూలై : 4 : గత నంవత్సరం నుంచి యాదిరెడ్డిపల్లి గ్రామం నుంచి నుమారు 30 మంది విద్యార్థులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారని బి ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు

వర్షాకాలం కావడంతో విద్యార్థులు ఉదయం సాయంత్రం వర్షంలో తడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని .

సాయంత్రం వేళల్లో రోడ్లపై విష పురుగులు తిరిగే అవకాశం ఉంది అలాగే శీతాకాలంలో త్వరగా చీకటి పడటంతో అమ్మాయిలు, వాళ్ల తల్లిదండ్రులు భయాందోళన కు గురవుతున్నారని జిల్లా అధ్యక్షులు మద్దెలబండ సాయిబాబా అన్నారు.

తమ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించి విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదం చేయాలని తల్లిదండ్రులు వేడుకున్నారు.

బస్సు సౌకర్యం కల్పిస్తే మరింత మంది విద్యార్థులు పాఠశాలలో ప్రవేశం పొందే అవకాశం ఉందని, లేదంటే విద్యార్థులు చదువుకు దూరం అయ్యే అవకాశం ఉందని విద్యార్థులు వాపోయారు.

ఈ కార్యక్రమంలో తాడూరు మండల నాయకులు జన్ను ఆంజనేయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ పోరాటంతోనే రైతులకు ధాన్యం బకాయిలు – డాక్టర్ చెన్నమనేని వికాస్

వేములవాడ, ఆగస్టు 4: వేములవాడ మండల రైతుల ఖాతాల్లో రెండు నెలలుగా నిలిచిపోయిన ధాన్యం బకాయిలు జమ కావడం బీజేపీ చేపట్టిన నిరంతర పోరాట ఫలితమేనని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ అన్నారు.

మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు పలుమార్లు కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో బీజేపీ రైతులకు అండగా నిలిచి నిరసనలు, వినతిపత్రాలు, అధికారులతో చర్చల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిందని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాల కారణంగా 58 మంది రైతులకు సుమారు రూ. 52 లక్షల చెల్లింపులు నిలిచిపోయాయని, రైతులు తూకం వేసిన ఏడు లారీల ధాన్యం గమ్యస్థానానికి చేరకపోవడం, ట్రక్ షీట్లు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. బీజేపీ ఉద్యమంతో ప్రభుత్వం స్పందించి రైతుల ఖాతాల్లో బకాయిలు జమ చేసిందని పేర్కొన్నారు.

ఇకపై రైతుల విషయంలో ఇలాంటి నిర్లక్ష్యం, అక్రమాలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్, పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, జనరల్ సెక్రటరీ సిరికొండ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జల్లెడ పడుతున్న అటవి శాఖ అధికారులు- కబ్జాల గుర్తింపులో నిమగ్నం



జహీరాబాద్ ఆగష్ట 4: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం జిరంగనగర్, గుడుపల్లి గ్రామాల మధ్యలో గల ఫారెస్ట్ ల్యాండ్ చాలా మేరకు కబ్జాకు గురైంది. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు కబ్జా భూములను గుర్తించడంలో ఫారెస్ట్ అధికారులు బిజీ అయ్యారు. అటవి భూములలో ఎంత వరకు కబ్జా అయ్యిందో తెలుసుకునేందుకు జల్లడ పడుతున్నారు. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు అధికారులు భూముల గుర్తింపులో బిజీగా ఉన్నారు. గ్రామస్తులు సైతం అధికారులకు సహకరిస్తు దినమంతా అడవిలోనే గడుపుతున్నారు. అక్కడే వంట వార్పు చేసుకుంటూ పూర్తి సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన భూములకు మించి అదనంగా కబ్జాలో ఉన్న భూములను గుర్తిస్తూ వాటిని అధీనంలోకి తీసుకుంటూ ట్రెంచ్ వేస్తున్నారు. జెసిబి సహాయంతో అధికార బృందం కబ్జా ఫారెస్ట్ భూములకు బౌండరీ వేస్తున్నారు. జహీరాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యామ్ సుందర్ రావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ సంతోషి, అరుణ, గంగా భవాని, కిరణ్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ నిజముద్దీన్, అమ్రానాయక్, జాదవ్ రాజు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

రైతులకు శాశ్వత సాగునీటి భరోసా

చివరి ఎకరం వరకు నీరందించడమే లక్ష్యం - ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 04 తెలంగాణ పవర్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని సీతారామపురం వద్ద నిర్మితమవుతున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రాజెక్టులో అత్యంత కీలకమైన బాహుబలి మోటార్ అమరిక పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తయిన అనంతరం ఈ ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించి అశ్వాపురం మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.



రాజీవ్ సాగర్ ప్రాజెక్టు ప్రారంభ సమయంలో ఎమ్మెల్యేగా ఉండడం, నేడు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి దశకు చేరుకున్న సందర్భంలో కూడా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.

లెఫ్ట్ కెనాల్ ద్వారా ఆరు గ్రామపంచాయతీల పరిధిలోని సుమారు 12 వేలకుపైగా ఎకరాలకు, రైట్ కెనాల్ ద్వారా 10 చెరువులను నింపి దాదాపు 30 వేల ఎకరాలకు చివరి ఎకరం వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ టి. వెంకటేశ్వరరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కె. శ్రీనివాస్, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఎంఈఐఎల్ సిబ్బంది, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, గాదె కేశవరెడ్డి, ఆవుల రవి, వేములపల్లి రమేష్, ఉసా అనిల్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భూరెడ్డి వెంకటరెడ్డి, తుక్కాని మధు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు' యువత ఉద్యోగాల కోసం డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చిన ఎంపీ గడ్డం వంశీ

తెలంగాణ పవర్ :పెద్దపల్లి :ఆగష్ట 04: రామగుండం ప్రాంత కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డంవంశీ కృష్ణ, మంగళవారం ఎన్టీపీసీ ఛైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ గుర్ దీప్ సింగ్,ని కలిసిపలు కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈసందర్భంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు

నిర్వహిస్తున్న కార్మికులకుగ్రేడ్-బి రేటింగ్,కల్పించి న్యాయమైన వేతనాలు,సంక్షేమ ప్రయోజనాలు అందేలాతక్షణ చర్యలుతీసుకోవాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అవసరమైన మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌ను ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారాసంవత్సరానికి ఒక్కసారి మాత్రమే జారీ చేసే విధానాన్ని అమలు చేయాలనివిజ్ఞప్తి చేశారు. ఈఎస్ ఐ సౌకర్యంఉన్నప్పటికీ ప్రైవేట్‌ఆసుపత్రుల్లో అదనపు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితిని వెంటనే సరిదిద్దాలని,దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.



అదేవిధంగా ఎన్టీపీసీలో నిర్మాణంలోఉన్న 800ఐ3 మెగావాట్ల సూపర్ థర్మల్ విస్తరణ ప్రాజెక్టులో స్థానికయువతకే మొదటి ప్రాధాన్యం కల్పించిభారీఎత్తున ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలనిఎంపీ గడ్డంవంశీ కృష్ణ ఎన్టీపీసీ యాజమాన్యాన్ని కోరారు.

అథ్లెటిక్స్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల సత్తా

- నాలుగు బంగారు పతకాలతో రాష్ట్ర స్థాయికి ఎంపిక

కరీంనగర్, ఆగస్టు 4: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన తొలి కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నాలుగు బంగారు, నాలుగు రజత, మూడు కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు గెలిచిన విద్యార్థులు ఈ నెల 7న హనుమకొండ జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అథ్లెటిక్స్ అన్ని క్రీడలకు పునాది అని, వేగం, బలం, ఓర్పు, క్రమశిక్షణను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలకు ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారవుతారని పేర్కొన్నారు.

ఓ ఆశ్రిత (4వ తరగతి) -- అండర్-10, 60 మీ. పరుగు -- బంగారం

ఆరుష్ (7వ తరగతి) -- అండర్-12, స్టాండింగ్ లాంగ్ జంప్ -- బంగారం, షాట్‌పుట్, బ్యాక్ త్రో -- రెండు రజతాలు

పైజాన్ (5వ తరగతి) -- అండర్-12, 60 మీ. 400 మీ. పరుగులు -- రెండు బంగారు పతకాలు

సాకీబ్ (8వ తరగతి) -- అండర్-14, కిడ్ జావెలిన్ త్రో -- రజతం

మాన్విత (4వ తరగతి) -- స్టాండింగ్ లాంగ్ జంప్ -- రజతం, 60 మీ. పరుగు -- కాంస్యం

సిద్ధాంత్ (7వ తరగతి) -- స్టాండింగ్ లాంగ్ జంప్ -- రజతం



ప్రణ్య (4వ తరగతి) -- 300 మీ. పరుగు -- కాంస్యం

హ్రిధన్ (3వ తరగతి) -- అండర్-8, 150 మీ. పరుగు -- కాంస్యం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు డాక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు. అనంతరం విజేతలను పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా

రామాయణ ట్రైలర్ విడుదల

అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి



ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది. విజువల్స్‌కు తగ్గట్టుగా వినిపించిన సంగీతం.. ప్రతి సన్నివేశానికి వీక్షకులు లీనమయ్యేలా ఉంది. 'రామాయణ' ట్రైలర్ కేవలం ఓ సినిమా ప్రమోషన్‌లా కాకుండా భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించే మహత్తర సినీ ప్రయాణానికి నాందిగా నిలిచింది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి రూ.4000 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. శీబా చద్దా.. మంథర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.



మరో లవ్ గ్రాక్ మూవీ శ్రీనివాస మంగాపురం

ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన



ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్ధం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే ప్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది.

లెనిన్ సరికొత్త రికార్డులు

వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బ్-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు.

విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ వనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టా÷-గ్ట÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు



సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844